విశాలాంధ్ర
గుంటూరు జిల్లా

విజ్ఞాన్స్‌లో కె.విశ్వనాథ్‌కు ఘన నివాళి

ఫైల్‌ఫోటో

విశాలాంధ్ర-గుంటూరు : విజ్ఞాన్స్ యూనివర్సిటీలో ప్రముఖ సినీ దర్శకుడు, కళాతపస్వి కె.విశ్వనాథ్‌కు శుక్రవారం ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ తెలుగు సంస్కృతికి, భారతీయ కళలకు తన సినిమాల ద్వారా గొప్ప గుర్తింపు తీసుకురావడంలో విశ్వనాథ్ కృషి చేశారన్నారు. ఆయన దర్శకత్వంలో వచ్చిన సినిమాలు సినీ సాహిత్యానికి, సంప్రదాయ సంగీతానికి, కళలకు, చిత్రసీమకు ఎనలేని ప్రతిష్టను తెచ్చాయన్నారు. సామాజిక అంశాలను ఇతివృత్తంగా తీసుకుని విశ్వనాథ్ చేసిన సినిమాలు గొప్ప మార్పునకు దారితీశాయన్నారు. కళా రంగంతో పాటు సాహిత్యంలో ఎన్నో ఘనతలు సాధించిన ఆయనకు విజ్ఞాన్స్ యూనివర్సిటీ 5వ స్నాతకోత్సవంలో గౌరవ డాక్టరేట్ అందించిన విషయాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. స్టూడియోలో సౌండ్ రికార్డిస్ట్‌గా సినీ జీవితాన్ని ప్రారంభించి... సినీ రంగంలో అత్యున్నత స్థాయికి ఎదిగారని, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు అందుకున్నారని, ఆయన ప్రస్థానం నేటి విద్యార్థులకు ఆదర్శప్రాయమని అన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ భవనం వినియోగంలోకి తేవాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గత ప్రభుత్వ హయాంలో కోట్ల రూపాయలతో అసం పూర్తిగా నిర్మించిన అంబేద్కర్ భవనాన్ని వినియోగంలోకి తేవాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వ విప్, వైసీపీ జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్యవర ప్రసాద్‌ను కోరారు. శుక్రవారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ళ ప్రకాష్ మాట్లాడుతూ నిరుపయోగంగా ఉన్న అంబేద్కర్ భవనాన్ని వినియోగంలోకి తేవడం వలన వివిధ ప్రజా సంఘాల వారు సభలు, సమావేశాలు నిర్వహించు కోవడానికి వీలుంటుందన్నారు. వేల రూపాయలు ఖర్చు పెట్టి పెద్దపెద్ద హోటల్స్‌లో సమావేశాలు... ఇంకా వేరే కార్యక్రమాలు నిర్వహించుకు నేందుకు స్తోమత అంతంత మాత్రంగా ఉన్నందున అంబేద్కర్ భవ నాన్ని వినియోగంలోకి తేవాలని కోరారు. కార్యక్రమంలో రజాక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జుపూడి శ్రీనివాసరావు, దళిత హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా ప్రభుదాస్, వీకేసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్‌జే విద్యాసాగర్, భీమ్‌సేన సేవా దళ్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపు నీలాంబరం, భీమ్ భారత్ రాష్ట్ర నాయకులు దొడ్డ ప్రసాద్, యరగుట్ల సుజాతరావు, మహిళా నాయకులు రావినూతల కమల కుమారి, షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

మలబార్‌లో 'ఆర్టిస్ట్రీ బ్రాండెడ్ జ్యువలరీ షో'

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక లక్ష్మీపురంలోని మలబార్‌గోల్డ్ అండ్ డైమండ్ షోరూమ్‌లో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఈ నెల 6వ తేదీ వరకు 'ఆర్టిస్ట్రీ బ్రాండెడ్ జ్యువలరీ ప్రదర్శ' గుంటూరు ప్రజలకు అందుబాటులో తేవడం గొప్ప విషయమని గుంటూరు తూర్పు వైసీపీ మహిళా నాయకురాలు నూరి ఫాతిమా, ప్రముఖ క్రిటికల్ కేర్ ఫిజీషియన్ డాక్టర్ ముక్క మానసలు తెలిపారు. ఈ మేరకు మలబార్‌గోల్డ్ షోరూమ్ ప్రతినిధులు సమక్షంలో వారు 'ఆర్టిస్ట్రీ బ్రాండెడ్ జ్యువలరీ ప్రదర్శన'ను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. బంగారం, వజ్రాభరణాలు, జాతి రత్నాభరణాలు ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంటాయన్నారు. వివాహం, పార్టీ సంబరాల కోసం 'మైన్' వజ్రాభరణం, జాతి రత్నాభరణాల సమూహం, హస్తకళ నైపుణ్యంతో తయారు చేసిన ఫ్రెష్యా ఆభరణాలు, మగువల మనస్సులు దోచే జోల్ ఆభరణాలు, ప్రాచీన సంప్రదాయం వ్యక్తంచేసే డివైన్ ఆభరణాలు, చిన్నారుల కోసం స్టార్లెట్ తదితర ఆభరణాలు ఈప్రదర్శనలో ఉన్నాయని స్టోర్ హెడ్ నదీర్ తెలిపారు. ఈ ప్రారంభోత్సవంలో డాక్టర్ ఈదర ప్రజ్ఞాంజలి, ఆధ్యాత్మికవేత్త వెంకటరమణ, మార్కెటింగ్ మేనేజర్ గోపీ కిరణ్, స్టోర్ మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పశు వైద్య అంబులెన్స్ ప్రారంభం

విశాలాంధ్ర-పొన్నూరు : పశువులకు నాణ్యమైన సత్వర వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన సంచార పశు వైద్య వాహనాలను పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్య శుక్రవారం ప్రారంభించారు. చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామంలో కొత్తగా 2 పశుసంచార అంబులెన్‌లను సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాడి రైతు లకు ఆర్థిక భరోసా కల్పించడంతోపాటు పశువులకు నాణ్యమైన వైద్యాన్ని ఇంటి వద్దనే అందించేందుకు చేపట్టిన కార్యక్రమాన్ని ప్రారం భించడం సంతోషకరమన్నారు. సంచార పశు వైద్య అంబులెన్స్‌లను పశు పోషకులు సద్వినియోగపరచుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య అధికారులు, సచివాలయ సిబ్బంది, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నోటీస్ బోర్డుల్లో వాలంటీర్ల ఖాళీ పోస్టుల వివరాలు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 207వార్డు సచివాలయాల్లో ఖాళీగా ఉన్న 82 వార్డు వాలంటీర్ల పోస్టులను భర్తీ చేయుటకు ఈ నెల 4న అన్ని వార్డు సచివాలయాల్లో నోటీసు బోర్డుల్లో ఖాళీగా ఉన్న వార్డు వాలంటీర్ల పోస్టుల వివరములను ప్రచురిస్తామని నగర కమిషనర్ కీర్తి చేకూరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

21 మంది విద్యార్థులకు విదేశీ విద్యా దీవెన

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: రాష్ట్రంలోని పేద విద్యార్థులు ప్రపంచంలోనే అత్యున్నత యూనివర్సిటీలలో ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం కల్పించే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నారని శాసనమండలి సభ్యులు, ప్రభుత్వ విప్ డొక్కా మాణిక్యవరప్రసాద రావు తెలిపారు. శుక్రవారం తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న విదేశీ విద్యా దీవెన పథకంను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద రావు, కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్తు చైర్మన్ మందపాటి శేషగిరిరావు పాల్గొన్నారు. జిల్లాలో జగనన్న విదేశీ విద్యా దీవెన పథకంకు అర్హత పొందిన 21 మంది విద్యార్థులకు మంజూరు చేసిన మొదటి విడత ఆర్థిక సహాయం రూ 1,21,01,304 చెక్కును లబ్ధిదారులకు అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ సంవత్సర ఆదాయం రూ.8లక్షల లోపు ఉండి, 35 సంవత్సరాలలో లోపు ఉన్న వారు ఈ పథకంకు అర్హులని, సచివాలయాల ద్వారా ధరఖాస్తులు చేసుకోవచ్చున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర శాలివాహన, కుమ్మరి కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం, రాష్ట్ర కృష్ణ బలిజ పూసల కార్పొరేషన్ చైర్ పర్సన్ కోలా భవానీ మణికంఠ, రాష్ట్ర ఎస్ఆర్ఈడీసీ డైరక్టర్ కొత్త చిన్నపరెడ్డి, జిల్లా సాంఘీక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

నిరంతర కృషితోనే విజయం

విశాలాంధ్ర-గుంటూరు : వృత్తిలో రాణించటానికి కృషి ప్రధానమని, అదే విజయానికి మూలమని ఏపీ ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షుడు ఆచార్య రామమోహన్ రావు అన్నారు. గుంటూరు జాగర్లమూడి చంద్రమౌళి న్యాయ కళాశాల మూర్టు సొసైటీ ఆధ్వర్యంలో జరుగుతున్న రెండవ జాతీయ స్థాయి ముట్కోర్టు పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో సూక్ష్మ పరిశీలన ముఖ్యమనీ, పలు భాషల్లో నైపుణ్యం ఇందులో రాణించడానికి ఉపకరిస్తుందన్నారు. న్యాయవాదికి న్యాయపరమైన అంశాలతో పాటు సమాజాన్ని అర్థం చేసుకోవడం అవసరమన్నారు. వ్యక్తిత్వం, అభివృద్ధి ఒక్కరోజులో సాధ్యం కాదని, అది నిరంతర ప్రక్రియ అని తెలిపారు. నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటువంటి పోటీల్లో పాల్గొనడం వలన నైపుణ్యాలను పెంచుకోవచ్చని, జాగర్లమూడి చంద్రమౌళి ఆశయాలకు అనుగుణంగా కళాశాలలో కోర్సుల నిర్మాణం జరిగిందని చెప్పారు. వేమన కుప్పు స్వామి మాట్లాడుతూ చక్కని గ్రంథాలయంతో పాటు, విద్యార్థులకు కోర్టు పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీలు ప్రతి ఏడాది నిర్వహిస్తామని వెల్లడించారు. ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టినేని సుధాకర్ బాబు 20లో మొదటిసారి మోట్కోర్టు పోటీలను ప్రారంభించామని, 13 రాష్ట్రాలు నుంచి 30 జట్లు హాజరై నట్లు చెప్పారు. మొదటి రోజు 6 కోర్టులలో ఐదు రౌండ్ల పాటు జరిగిన పోటీలలో 30 జట్లు ప్రాథ మిక స్థాయి దశను పూర్తి చేశాయని, శనివారం క్వార్టర్ ఫైనల్స్, సెమీఫైనల్స్, ఫైనల్స్ జరుగుతా యని తెలిపారు. అనంతరం జరిగే ప్రధానోత్సవ కార్యక్రమానికి కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో ఏపీ సభ్యుడు ఎ.రామిరెడ్డి అతిథిగా హాజరవుతున్నట్లు ప్రిన్సిపల్ సుధాకర్ బాబు తెలిపారు. కార్యక్ర మంలో జేకేసీ కళాశాల కార్యదర్శి జాగర్లమూడి మురళీ మోహన్, కేవీఎల్‌పీ పాఠశాల కార్యదర్శి డాక్టర్ కె.కృష్ణ ప్రసాద్, ఆర్‌వీఆర్ విద్యా కళాశాల కార్యదర్శి గద్దె మంగ య్య, న్యాయ కళాశాల సంయుక్త కార్యదర్శి ఖైరపనేని నరేష్ తదితరులు పాల్గొన్నారు. న్యాయవాదులు బ్రహ్మా నంద రెడ్డి, బ్రహ్మరెడ్డి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

ఘనంగా శ్రీ సత్య షిరిడి సాయిబాబా మందిర వార్షికోత్సవ ఉత్సవాలు

విశాలాంధ్ర-మంగళగిరి : దక్షిణాదిన ప్రసిద్దిగాంచిన భగవాన్ శ్రీ సత్య షిరిడి సాయిబాబా మందిరం 17వ వార్షికోత్సవం ఆలయ కమిటీ చైర్మన్ పాతూరి నాగ భూషణం ఘనంగా నిర్వహించారు. ఉద యాన్నే స్వామివారికి పాలాభిషేకంతో పాటుగా సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, యూ బ్లడ్ ఫౌండర్ ఎలమంచిలి జగదీష్ బాబు, రమేష్ బాబు, కృష్ణమూర్తి ఆధ్వ ర్యంలో అన్నాభిషేకం నిర్వహించారు. అనంతరం వేల సంఖ్యలో వచ్చిన భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. మధ్యా హ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చిన్నలకు పెద్దలకు వినోదాన్ని అందించే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నుంచే కాకుండా వివిధ దేశాల నుంచి భక్తులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథులుగా శైవ క్షేత్ర పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ శివ స్వామి, మాజీ మంత్రులు కన్నా లక్ష్మీనారాయణ, పుల్లారావు, నక్కా ఆనంద్ బాబు, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, అనురాధ, మాజీ శాసనసభ్యులు శ్రావణ్ కుమార్, కొమ్మాలపాటి శ్రీధర్, చింతమనేని ప్రభాకర్, గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ సిసోడియా, కన్నా బాబు దంప తులు, సూర్య ప్రకాష్, బీజేపీ రాష్ట్ర కార్య దర్శి రమేష్ నాయుడు, పాటిబండ్ల రామకృష్ణ, లంక దినకర్, నాగేంద్ర, రామినేని ఫౌండేషన్ చైర్మన్ ధర్మ ప్రచారక్, బ్రాండిక్స్ అధినేత దొరై స్వామి, గంజి చిరంజీవి, చిల్లపల్లి శ్రీనివాసరావు తదితరులతో పాటు స్వామి వారి భక్తులు వేలాది సంఖ్యలో పాల్గొని బాబా వారి ఆశీస్సులు పొందారు. మహోన్నతమైన స్వామివారి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేసిన భక్తులందరికీ ఆలయ కమిటీ చైర్మన్ పాతూరి నాగభూషణం ధన్యవాదాలు తెలియజేశారు.

టీబీ పేషంట్ల పోషకాహారానికి చెక్కు అందజేత

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని జిల్లాలోని క్షయ వ్యాధిగ్రస్తులకు పోషక ఆహార పదార్థాలు అందజేసే నిమిత్తం Ni-Kshay Mitra అనే పేరుతో దాతలు ముందుకు వచ్చి ఒక్కొక్క టీబీ పేషెంట్‌కు నెలకు రూ.700 చొప్పున మొత్తం 6నెలలకు రూ.4200 అందజేయాలని జిల్లాలోని ప్రధాన కార్పొరేట్ సంస్థలకు, విద్యా సంస్థల అధిపతులకు, వివిధ డిపార్ట్‌మెంట్ ఉన్నతాధికారులను కోరారు. ఈ నేపథ్యంలో గుంటూరు ఐటీసీ సంస్థ వైస్ ప్రెసిడెంట్ (హెచ్ఆర్ విభాగం) వందమంది టీబీ పేషెంట్లకు ఆరు నెలలకు సరిపడా పోషకాహార పదార్థాలు అందజేసే నిమిత్తం రూ.4లక్షల 20వేలు చెక్కును జిల్లా కలెక్టర్ బ్యాంక్ అకౌంట్‌కు అందజేశారు.
టీబీ పేషంట్లకు ఆర్థిక సహకారం అందించిన ఐటీసీ వారికి జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జె.హనుమంతరావు, జిల్లా క్షయ నివారణ విభాగం అధికారి డాక్టర్ బిక్యా లక్ష్మానాయక్, పలువురు అధికారులు కృతజ్ఞతలు తెలియజేశారు.

6న టిడ్కో, జగనన్న కాలనీ లబ్ధిదారులు తరలిరావాలి: జంగాల

విశాలాంధ్ర-గుంటూరు : టిడ్కో గృహాలను లబ్ధిదారులకు మంజూరు చేయాలని, జగనన్న కాలనీ ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదిన కలెక్టర్ కార్యాలయం వద్ద తలపెట్టిన కార్యక్రమానికి లబ్ధిదారులు తరలిరావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ పిలుపు నిచ్చారు. ఈ మేరకు గుంటూరు మల్లయ్యలింగంభవన్ నుంచి శుక్రవారం వీడియో సందేశాన్ని విడుదల చేశారు. జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80 లక్షలు ఏమాత్రం సరిపోవన్నారు. దీంతో లబ్ధిదారులు ఇంటిని నిర్మించుకోలేక కొంత మంది అప్పుల పాలౌతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇంటి నిర్మాణానికి లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.5 లక్షలు ఆర్థిక సాయం చేయడంతో పాటు ఇసుక, సిమెంట్, ఇనుము ఉచితంగా ఇవ్వాలని అభ్యర్థిస్తూ కలెక్టర్‌కు లబ్ధిదారుల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని గుంటూరు, తెనాలి, మంగళగిరి, తాడికొండ, ప్రత్తిపాడు, పొన్నూరు నియోజకవర్గాల టిడ్కో, జగనన్న కాలనీ లబ్ధిదారులు 6న జరిగే కార్యక్రమంలో భాగస్వాములు కావాలని సీపీఐ తరుపున విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు.

ఉర్దూ పాఠశాలలను తనిఖీ చేసిన డీఐ

విశాలాంధ్ర-తెనాలి : తెనాలి మున్సిపాలిటీ పరిధి పినపాడు, నాజర్ పేటలోని మున్సిపల్ ఉర్దూ(ముస్లిం) ప్రాథమిక పాఠశాలలను ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎండీ ఖాసిం శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల రికార్డులను, ఉపాధ్యాయుల పాఠ్యప్రణాళికలను పరిశీలించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు వేసి సామర్థ్యాలు పరిశీలించి సంతృప్తి చెందారు. పాఠశాల రికార్డులు, పాఠ్య ప్రణాళికలు సక్రమంగా ఉండటం పట్ల ఉపాధ్యాయులు రిహానా, ఆయెషా రియాజ్‌లను అభినందించారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనం జగనన్న గోరుముద్ద ఆహార పదార్థాలను విద్యార్థులతో కలిసి పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

సొసైటీ అధ్యక్ష పదవి కాలం పొడిగింపు

విశాలాంధ్ర-తాడికొండ: సొసైటీ అధ్యక్షులు పదవి కాలాన్ని రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు ఆయా గ్రామ అధ్యక్షులకు శుక్రవారం ఉత్తర్వులు అందాయి. మరో ఆరు నెలల పాటు పదవిలో ఉంటారు. మండలంలో తాడికొండ, కంతేరు, బండారుపల్లి , రావెల, పొన్నెకల్లు సొసైటీలు ఉన్నాయి. వీరి పదవి కాలాన్ని జూన్ 31 వరకు పొడిగించారు. తాడికొండ సొసైటీ అధ్యక్షులుగా వంగా పోలా రెడ్డి మరోసారి పదవి బాధ్యతలు స్వీకరించారు. పలువురు వైసీపీ నాయకులు పోలారెడ్డిని ఘనంగా సన్మానించారు.

తెలుగుచలన చిత్రానికి ప్రపంచఖ్యాతి తెచ్చిన 'విశ్వనాథుడు'

విశాలాంధ్ర-గుంటూరు : సౌండ్ ఇంజనీరుగా చిత్ర సీమలో అడుగుపెట్టి, సహాయ దర్శకునిగా పనిచేసి ఆత్మగౌరవం చిత్రానికి తొలిసారిగా దర్శకత్వం వహించి తెలుగుచలన చిత్రానికి ప్రపంచఖ్యాతి తెచ్చిన కళా తపస్వి విశ్వనాథుని నిష్క్రమణ తెలుగు చలన చిత్ర రంగానికి తీరని లోటని గుంటూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సోమేపల్లి వెంకట సుబ్బయ్య, ఎస్ఎం సుభాని ఒక ప్రకటనలో తెలియజేశారు. శంకరాభరణం, సాగర సంగమం, స్వాతిముత్యం, సిరి సిరి మువ్వ, శృతిలయలు, శుభలేఖ, సప్తపది, సూత్రధారులు, స్వయంకృషి, స్వాతి కిరణం, స్వర్ణకమలం వంటి ఆణి ముత్యాలవంటి చిత్రాలతో తెలుగు చిత్ర పరిశ్రమను సుసంపన్నం చేసి విశ్వ విఖ్యాతినొందారు. పద్మశ్రీ, పద్మ విభూషణ్, దాదా సాహెబ్ ఫాల్కె పురస్కారంతో పాటు పలు పురస్కారాలు అందుకున్నారని గుర్తుచేశారు. నివాళు లర్పించిన వారిలో డాక్టర్ వి.నాగరాజ్య లక్ష్మి, బి.ఉమామహేశ్వర రెడ్డి, కేజే రమేష్, నానా, పి.బలరామ్, పి.దుర్గ, ప్రత్తిపాటి సుభాషిణి, షేక్ కాశింబి, డి.అనిల్ కుమార్, ఇ.వెంకటరెడ్డి, ఎం.లలిత కుమారి, తాటికొల పద్మావతి, ఎక్కంటి పద్మావతి, బుర్రి కుమార్రాజు, పి.విజయలక్ష్మి, తపతి కిరణ్, డి.అనిల్ నాయక్, కొణతం నాగేశ్వర రావు, టి.గోవిందయ్య, గాదేపల్లి మల్లికార్జునుడు, బి.వేలాంగిని రాజు తదితరులు ఉన్నారు.

తెలుగుజాతి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన విశ్వనాథుడు..
తెలుగు సినిమా ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన దిగ్గజ దర్శకులు, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత కళాతపస్వి కె.విశ్వనాథ్ మరణం తెలుగు సినీ జగత్తుకు తీరని లోటని రాష్ట్ర చిరంజీవి యువత ఉపాధ్యక్షుడు, గుంటూరు జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ళ హరి ఒక ప్రకటనలో అన్నారు. విశ్వనాథ్ మృతి పట్ల ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తన సినిమాలతో తెలుగు జాతి ప్రతిష్టని ప్రపంచం నలుమూలలకి తీసుకెళ్లిన ఘనత ఆయనదన్నారు.

సినీ, కళారంగానికి తీరని లోటు..
సుప్రసిద్ధ సినీ దర్శకుడు, నటుడు డాక్టర్ కె.విశ్వనాథ్ మృతి సినీ, కళారంగానికి తీరని లోటని డీసీసీ అధ్యక్షులు లింగంశెట్టి ఈశ్వరరావు, పీసీసీ అధికార ప్రతినిధి గడ్డం పాల్ విజయ కుమార్ ఒక ప్రకటనలో సంతా పం తెలిపారు. గుంటూరు జిల్లా పెదపులివర్రు గ్రామానికి చెందిన కాశీనాధుని విశ్వనాథ్ సినీ రంగంలోకి ప్రవేశించి అంచెలంచెలుగా ఎదిగారన్నారు. తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ సినిమాల ద్వారా కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న విశ్వనాథ్ భౌతికంగా మరణించినా తన సినిమాల ద్వారా ఎప్పుడూ ప్రేక్షకుల హృదయాల్లో జీవించే ఉంటారన్నారు.

కె.విశ్వనాథ్ మరణం బాధాకరం: ముస్తాఫా

ఫైల్‌ఫోటో

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : కళా తపస్వి, ప్రముఖ దర్శకులు, రచయిత, నటులు. సంప్రదాయ సంగీతానికి వెలుగులు అద్దిన కె.విశ్వనాథ్ గురువారం రాత్రి మరణించారు. 2015 జులై నెలలో గుంటూరు నగరంలోని నాజ్ సెంటర్‌లో అల్లూరి సీతారామరాజు విగ్రహావిష్కరణకు విచ్చేశారు. ఆ సమయంలో తూర్పు శాసన సభ్యులు మహమ్మద్ ముస్తఫా ఆయనను ఆప్యాయంగా పలకరించారు. విశ్వనాథ్ మరణం బాధాకరమని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఎమ్మెల్యే ముస్తఫా ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గుంటూరు వచ్చిన సమయంలో మాట్లాడుకున్న మాటలను గుర్తుకుతెచ్చుకున్నారు.

మాతా శిశు సంరక్షణ కేంద్ర నిర్మాణానికి సహకారం అందజేస్తాం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)లో మాత శిశు సంరక్షణ కేంద్రం నిర్మాణానికి తమ వంతు సహకారం అందిస్తామని గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం (జింఖానా1968) బ్యాచ్ ప్రకటించింది. జింఖానా బ్యాచ్‌కు చెందిన డాక్టర్ వెంకట్, డాక్టర్ నళినాక్షి, డాక్టర్ రామరాజు, డాక్టర్ సులోచన శుక్రవారం మాత శిశు సంరక్షణ కేంద్ర నిర్మాణ పనులను పరిశీలించారు. కేంద్ర నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతుండటంపై వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్ట్ వంద శాతం పూర్తి చేసేందుకు అవసరమైన ఆర్థిక చేయుత ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి, సమన్వయకర్తలు డాక్టర్ బాలభాస్కరరావు, డాక్టర్ పీవీ హనుమంతరావు పాల్గొన్నారు.

చైతన్య తపోవన్‌లో రజతోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-తాడేపల్లి : ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి నులకపేటలోని చైతన్య తపోవన్‌లో ఈ నెల 18వ తేదీ శనివారం నుంచి 22వ తేది బుధవారం వరకు రజతోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు చైతన్య తపోవన్ ట్రస్ట్ శివ కేశవ పీఠం సంస్థాపక పీఠాధీశ్వరి శ్రీమాతా శివానంద సరస్వతి శుక్రవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వేడుకలకు జగద్గురు కంచి కామకోటి పీఠాధీశ్వరులు చంద్రశేఖరేంద్ర సరస్వతి పరమాచార్య స్వామి, బ్రహ్మ శ్రీ చాగంటి కోటేశ్వరరావు, శ్రీ త్రిదండి చినజీయర్ స్వామి, స్వామి పరిపూర్ణానంద సరస్వతి, పలువురు ప్రముఖ స్వామీజీలు పాల్గొంటున్నారని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని చైతన్య తపోవన్ రజితోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం చైతన్యతపోవన్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

హాత్ సే హాత్ జోడో యాత్ర ప్రారంభం

విశాలాంధ్ర-తాడేపల్లి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమైంది. ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు మంగళగిరి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ షేక్ సలీం ఆధ్వర్యంలో చేయి చేయి కలుపు కార్యక్రమం ఇంటింటికి కాంగ్రెస్ పార్టీ పాదయాత్ర శుక్రవారం తాడేపల్లిలో జోడోయాత్ర ప్రారంభించారు. ఈ జోడయాత్ర తాడేపల్లి మణిపాల్ హాస్పిటల్ వద్ద నుంచి సుందరయ్య నగర్, సీతానగరం, ఉండవల్లి సెంటర్ వరకు సాగింది. ఈ సందర్భంగా సలీం మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దర్శనపు శామ్యూల్, మంగళగిరి ఎస్సీ సెల్ అధ్యక్షులు జీవన్ సాగర్, జిల్లా కమిటీ సెక్రటరీ చౌదరి, సీనియర్ నాయకులు గోలి సాంబశివరావు, తాడేపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు నరేష్, దుగ్గిరాల మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ రాంమూర్తి, బిక్ష రావ్, ప్రవీణ్, రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

కళాత్మక చిత్రాలకు చిరునామా కె.విశ్వనాథ్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : యావత్ తెలుగుజాతికి, భారతదేశానికి తన చిత్రాలతో రససిద్ధి కలిగించి పునీతం చేసిన కళా తపస్వి కె.విశ్వనాథ్ మరణం కళాభిమానులకు, సినిమాల ప్రేక్షకులందరికీ తీరని లోటు అని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తంచేశారు. కె.విశ్వనాథ్ భౌతికంగా దూరమైనా, తెలుగువారి మనస్సులో ఎప్పటికీ ఆరాధ్యుడుగానే నిలిచిపోతారన్నారు.
నేడు సంస్మరణ సభ : స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో శనివారం సాయంత్రం 6గంటలకు కళాతపస్వి కె.విశ్వనాథ్ సంస్మరణ సభ జరుగుతుందని ఆ సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తెలిపారు.

యేలూరి హాస్పిటల్ వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక ఓల్డ్‌క్లబ్‌రోడ్డు కొత్తపేటలో ఆధునిక హంగులతో నిర్మించిన 'యేలూరి హాస్పిటల్' మొదటి వార్షికోత్సవ వేడుకలు హాస్పిటల్ అధినేత, ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు డాక్టర్ యేలూరి రామకృష్ణ, ప్రముఖ క్రిటికల్ కేర్ ఫిజీషియన్ డాక్టర్ ముక్క మానసాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 'ఆరోగ్య సంరక్షణ'అనే హెల్త్ కార్డును వారు ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో వారు మాట్లాడుతూ యేలూరి హాస్పిటల్ మొదటి వార్షికోత్సవం సందర్భంగా రెండు రోజులు పాటు ఓపీ ఉచితంగా చూస్తారని, బీపీ, షుగర్ తదితర అనారోగ్య సమస్యలకు వైద్య సేవలు ఉచితంగా చేస్తారని అన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ మెరుగైన వైద్య సేవలు పొందని వారికి కోసం 'ఆరోగ్య సంరక్షణ' అనే హెల్త్‌కార్డును అందుబాటులో తెచ్చామని, ఈ కార్డు ఉన్నవారు భవిష్యత్‌లో ఏ అనారోగ్య సమస్యలు వచ్చినా రాయితీ ధరలలో వైద్య సేవలు చేస్తారని వెల్లడించారు. ఈ హెల్త్ కార్డును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ ముక్క మానసాలు కోరారు. ఈ కార్డు వలన ఐదుగురు (1+4) సభ్యులు లబ్ది పొందవచ్చున్నారు. ఈ వేడుకల్లో జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ఈదర ప్రజ్ఞాంజలి, హాస్పిటల్ మేనేజర్ యోహాను, సిబ్బంది పాల్గొన్నారు.

Before the Hon'ble Deputy Registrar of Chits:: Guntur
Dispute No.:71/2022

Between:
M/s. Shriram Chits India Pvt.Ltd.,Tenali Branch Rep by its Legal Manager/ G.P.A.Holder **- Disputant**
And
Valeti Sridevi & Others - Opponents
To

Opp.No-3: Gaja Shekar, S/o. Subbaiah, R/o.Door No: 2-14- 364,Syamala Nagar 5th lane, Guntur.

Please take notice that the above dispute is filed against opponent -3 of you and Others for Recovery of **Rs. 4,93,164/- (Rupees Four Lakhs Ninty Three Thousand One Hundred and Sixty Four only)** and the same is posted to **Dt: 21-02-2023** for the appearance of you Before the Hon'ble Deputy Registrar of Chits, Guntur @ **10-30 AM.** If you fail on that day the matter will be heard and decided Ex-party basis on the material available.

(By order of the Deputy Registrar of Chits, Guntur)

Lanka Vijaya Kumar,
Lanka Vamsi Krishna
Advocates for Disputant, Guntur.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన గుంటూరు సిటీ, చౌత్ర, వంగా వారి వీధి, డోర్ నెం: 21-06-26, కాపురస్తుడు **రాగం ముక్తేశ్వరరావు** గారి కుమారుడు రాగం **ఉమా మహేశ్వరరావు** గారి సూచనల మేరకు యావన్మందికీ తెలియజేయునది ఏమనగా,

నా క్లయింటు పేరిటికి గుంటూరు డి॥ & సబ్.డి, గుంటూరు గ్రామ డి.నెం: 778/1 లో చ.గ. 600లు స్థలము అందలి ఇంటిని ది: **21-05-1983**న **విక్రయ దస్తావేజు నెం: 4402/1983,** యస్.ఆర్.ఓ. గుంటూరు రీత్యా సంక్రమించి సర్వ సంపూర్ణ హక్కు భుక్తములతో అనుభవించుచున్నారు. అట్టి ఆస్థికి చెందిన ఒరిజినల్ విక్రయ **దస్తావేజు** నెం: **4402/1983** యస్.ఆర్.ఓ. గుంటూరును ఒక బ్యాగులో పెట్టుకొని ది: **27-01-2023**న, చింతపల్లి పాడు నుండి ఆటోలో యద్దనపూడి గ్రామమునకు వెళ్ళు సమ యంలో సదరు దస్తావేజు పోయినది. కావున ఎవరికైన సదరు దస్తావేజు దొరికిన యెడల నాకు గాని, నాక్లయింటు గాని అందజేసిన వారికి తగిన బహుమతి ఇవ్వబడును. అట్లు గాక సదరు దస్తావేజును ఉపయోగించి ఏవిధమైన అన్యాక్రాంతములు చేసిన యెడల నా క్లయింటు తీసుకోను చట్టపరమైన సివిల్ & క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురు.

హబీబుల్లా షేక్, అడ్వకేట్,
జిల్లా కోర్టు ఎదురు, గుంటూరు.
సెల్: 9948291989

Before the Hon'ble Deputy Registrar of Chits:: Guntur
Dispute No.:64/2022

Between:
M/s. Shriram Chits India Pvt.Ltd.,Tenali Branch Rep by its Legal Manager/ G.P.A.Holder **- Disputant**
And
Vemulapalli Rajesh & Others **- Opponents**
To

Opp.No-2: Boddu Srinivasa Rao, S/o. Lakshmaiah, W/as.School Teacher, M.P.P.S.Ramachandra Puram, Sattenapalli, Narasaraopet (Dt), and R/o.Door No: 11-5-36/1/B, Raghuram Nagar, Pragathi School Road, 1st ward Sattenapalli, Narasaraopet Dist.

Please take notice that the above dispute is filed against opponent -2 of you and Others for Recovery of **Rs. 13,06,600/- (Rupees Thirteen Lakhs Six Thousand Six Hundred only)** and the same is posted to **Dt: 21-02-2023** for the appearance of you Before the Hon'ble Deputy Registrar of Chits, Guntur @ **10-30 AM.** If you fail on that day the matter will be heard and decided Ex-party basis on the material available.

(By order of the Deputy Registrar of Chits,Guntur)

Lanka Vijaya Kumar,
Lanka Vamsi Krishna
Advocates for Disputant, Guntur.

CHANGE OF NAME

I, **PERISETTY SRINIVASA RAO,** S/o. Perisetty Narasaiah, R/o. D.No.27-9-4, Kanna Vari Thota 2nd Lane, Alankar Thiyetar, Guntur, Guntur District - 522004, A.P, have changed my wife's name from **PERISETTY BRAMARA SIRISHA** (Old name) to **PERISETTY SIRISHA.** Hereafter my wife's name is known as **PERISETTY SIRISHA.**

Before the Hon'ble Deputy Registrar of Chits:: Guntur
Dispute No.:62/2022

Between:
M/s. Shriram Chits India Pvt.Ltd.,Tenali Branch Rep by its Legal Manager/ G.P. A.Holder **- Disputant**
And
Ravuri Suresh & Others **- Opponents**
To

Opp.No-2: Zampani Asha Jyothi, W/o. Ramesh Babu, W/as. PHN(NT)at Primary Health Centre, Pedha palakaluru, Guntur Dist. And R/o. Door No: 26-17-16A,1st line Ankamma Nagar, Guntur, Guntur Dist.

Please take notice that the above dispute is filed against **opponent -2** of you and Others for Recovery of **Rs. 2,59,720/- (Rupees Two Lakhs Fifty Nine Thousand Seven Hundred and Twenty only)** and the same is posted to **Dt: 21-02-2023** for the appearance of you Before the Hon'ble Deputy Registrar of Chits, Guntur @ **10-30 AM.** If you fail on that day the matter will be heard and decided Ex- party basis on the material available.

(By order of the Deputy Registrar of Chits, Guntur)

Lanka Vijaya Kumar,
Lanka Vamsi Krishna
Advocates for Disputant, Guntur.

నోటీసు
మహారాజశ్రీ గుంటూరు 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి.నెం:14/2022 ఇన్ ఓ.యస్. నెం: 448/1992
బిట్వీన్:
యడ్లపల్లి దశరథ రామయ్య - డి.హెచ్.ఆర్.
మరియు
డా. కొల్లి కృష్ణ ప్రసాద్(డైడ్) వగైరాలు - జె.డి.ఆర్స్.
టు,
J.D.R.No-2:చిట్టమనేని కృష్ణకుమారి, భర్త.మస్తాన్ రావు, నివాసం. ఇంటి నెం: 7, సాంబిరెడ్డి బిల్డింగ్స్, జె.కె.సి. కాలేజీ దగ్గర, గుంటూరు-7.
J.D.R.No-4: కొల్లి వేణుగోపాల్, తండ్రి. లేటు కృష్ణ ప్రసాద్,
J.D.R.No-5: కొల్లి శ్రీనివాస కుమార్, తండ్రి. లేటు కృష్ణప్రసాద్,
J.D.R.No-6: కొల్లి జ్యోత్స్న రాణి, తండ్రి. లేటు కృష్ణ ప్రసాద్, JDR No. 4 to 6 ల నివాసం. ఇసుకపల్లి గ్రామము, రేపల్లె పోస్టు, గుంటూరు జిల్లా.
పై నెంబరు ఇ.పి.లో జె.డి.ఆర్స్ అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా నోటీసులు పంపించినను మీరు తీసుకోనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు Substitute Service ద్వారా పేపరులో ప్రకటన ద్వారా తెలియపరచమని ఆర్డరు వేయగా, సదరు ఆర్డరు ప్రకారము మీరు **ది:03-03-2023**న ఉ. గం.10-30 ని.లకు పై తెలిపిన కోర్టునకు మీరు స్వయంగా కానీ, మీ అడ్వకేటు ద్వారా గానీ హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలయును. లేని యెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని తెలియపరచమైనది.
(శ్రీ కోర్టు వారి అనుమతితో)
వాయిదా తేది:03-03-2023

సి.నరేంద్ర బాబు, డి.హెచ్.ఆర్ తరపు అడ్వకేట్, గుంటూరు,
సెల్: 92464 85115

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

వైస్ ఎంపీపీగా బాలమేరి ఏకగ్రీవం

విశాలాంధ్ర-పెదకూరపాడు : మండల పరిషత్ ఉపాధ్యక్షురాలుగా లింగంగుంట్ల గ్రామానికి చెందిన కుక్కమళ్ళ బాలమేరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాటిబండ్ల ఎంపీటీసీ సభ్యులు పాటిబండ్ల మేరీ రాణి కుక్కమళ్ళ బాలమేరిని ఉపాధ్యక్షురాలుగా ప్రతిపాదించారు. పెదకూరపాడు ఎంపీటీసీ సభ్యులు కంచర్ల నిర్మల ఆమోదించారు. అనంతరం సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రిసైడింగ్ అధికారి వరప్రసాద్ ఆధ్వర్యంలో వైస్ ఎంపీపీకి నియామక పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీడీవో నరసింహారావు, సూపరింటెండెంట్ ఎ.కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు కారుమంచి విద్యార్థి

విశాలాంధ్ర-శావల్యాపురం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బేస్ బాల్ పోటీలలో కారుమంచి జడ్పీ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి మల్లాపరపు వినయ్ కుమార్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు శంకర రంగారావు శుక్రవారం తెలిపారు. పీడీ పొదిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జనవరి నెల 28, 29, 30వ తేదీలలో కాకినాడలో జరిగిన అండర్-14 బాలుర రాష్ట్ర స్థాయి బేస్ బాల్ ఎంపిక పోటీలలో వినయ్ కుమార్ అత్యున్నత ప్రతిభ కనబరచి జాతీయ జట్టుకు ఎంపికైనట్లు, అలాగే అండర్-17 బాలుర బేస్ బాల్ పోటీలలో 9వ తరగతి విద్యార్థి యస్వంత్ రాష్ట్ర స్థాయిలో గోల్డ్ మెడల్ సాదించారని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, పీడీ, ఉపాధ్యాయులు సురేష్, కోటేశ్వరరావు, కొండలరావు, శ్రీనివాసరావు, మాధవి లత, బసవయ్యలు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

విధులపై అలసత్వం సహించం

విశాలాంధ్ర-దుర్గి : విధి నిర్వహణలో అందరూ అంకితభావంతో పని చేయాలని, అలసత్వం వహిస్తే సహించేది లేదని మండల స్పెషలాఫీసర్ కె.సంజీవరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు ఆధార్ రీమార్పుపై జరిగిన రివ్యూ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధి కూలీల ఆధార్‌లో తప్పులు, జాబ్ కార్డుకు ఆధార్ ఇవ్వని కూలీల నుంచి ఆధార్ కార్డు సేకరించి తమకు అప్పగించిన పనులను సకాలంలో పూర్తి చేయాలని కోరారు. ఎంపీపీ యేచూరి సునీత సాయి శంకర్ మాట్లాడుతూ నాయకులు చేసిన పనులకు బిల్లులు రావా లంటే ఉపాధి సిబ్బంది కూలీల ఆధార్లో ఉన్న తప్పులు సరిచేసి వారిలో ఎక్కువ మంది కూలీలతో పనిచేయించాలన్నారు. అనంతరం ఉపాధి సిబ్బంది నూతనంగా వచ్చిన స్పెషలాఫీసర్ సంజీవరావుకు, ఎంపీపీకి శాలువాలతో సన్మానించారు.

కస్తూరిభా బాలికల వసతి గృహం తనిఖీ

విశాలాంధ్ర-దుర్గి : మండల కేంద్రమైన దుర్గిలోని కస్తూరిభా గాంధీ గిరిజన బాలికల విద్యాలయ వసతి గృహం, ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా నవోదయ మోడల్ ఆఫీసర్, మండల స్పెషలాఫీసర్. కె.సంజీవరావు, ఎంపీపీ యేచూరి సునీత సాయి శంకర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్పెషలాఫీసర్ సంజీవరావు తొలుత కస్తూరిభా పాఠశాలకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన బాలికలతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. మెనూ ప్రకారం ఆహార పదార్థాలు రుచిగా తయారు చేసి పెడుతున్నారా అని బాలికలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉందని సంతృప్తి వ్యక్తం చేశారు. నీటి తొట్టి పాచితో ఉండటంతో చూసిన ఆయన పాఠశాల ఎస్ఓ దానమ్మను పిలిచి వెంటనే నీటిని బయటకు తీసి బ్లీచింగ్‌తో శుభ్రంగా కడిగి, నీటి తొట్టిపై రక్షణ కవచం ఏర్పాటు చేయాలని, ఆర్వో ప్లాంట్ మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. బ్లీచింగ్ చల్లించి శుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం ప్రక్కనే ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి డెలివరీ, ట్యూబెక్టమీ రికార్డులు తనిఖీ చేశారు. హాస్పిటల్‌లోని పలు విభాగాల గదులను చూశారు. రోగులకు ఉపయోగించే బెడ్లు కొత్తవి ఉండటాన్ని చూసి సంతృప్తి చెందారు. డెలివరీ, ట్యూబెక్టమీ సంబంధించి ఆన్‌లైన్ రిపోర్ట్ కాఫీ అందజేయాలని కోరారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలికి పెన్షన్ అందజేత

విశాలాంధ్ర-రొంపిచర్ల : మండల కేంద్రమైన రొంపిచర్లకు చెందిన వృద్ధురాలు ఏమిరెడ్డి తిరుపతమ్మ గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గుంటూరులో ఒక ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. గ్రామ వలంటీర్ షేక్ రఫీ ఆమెకు వృద్ధాప్య పెన్షన్ ఇచ్చేందుకు ఇంటి దగ్గరకు వెళ్లగా ఆమె ఇక్కడ లేరని, గుంటూరులో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామ వలంటీర్ షేక్ రఫీ శుక్రవారం గుంటూరుకు బయలుదేరి ఆమె ఉన్న ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి పెన్షన్ అందజేశారు. ఈ విధంగా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వృద్ధురాలికి పెన్షన్ అందజేసిన గ్రామ వలంటీర్ రఫీని గ్రామస్తులు అభినందించారు.

నాణ్యమైన భోజనం అందించాలి



విశాలాంధ్ర-రెంటచింతల: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి ఎం.విజయభాస్కరరెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక వైఆరోయస్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. గోలిలో నిర్మాణంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రం స్థలాన్ని పరిశీలించారు గృహ నిర్మాణశాఖాధికారులతో సమీక్ష నిర్వహించారు. వీరి వెంట ఎంపీడీఓ గౌసియాబేగం, వైద్యులు కృష్ణారెడ్డి, ఎంఈఓ వెంకటేశ్వర్లు, మహాలక్ష్మి, నరేంద్రరెడ్డి, చిన్నబాబు పలువురు అధికారులు ఉన్నారు.

గృహ లబ్ధిదారులకు చెక్కులు అందజేత

విశాలాంధ్ర - నకరికల్లు : మండలంలోని చల్లగుండ్ల గ్రామానికి చెందిన గృహ లబ్ధిదారులకు శుక్రవారం ప్రభుత్వ అధికారులు చెక్కులను అందజేశారు. పిడిడిఆర్‌డిఏ బాలునాయక్ సమక్షంలో ఎంపిడిఓ బండి శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపిపి ప్రవీణ్‌లు గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఎస్‌హెచ్‌జి కింద ఒక్కొక్కరికి రూ.35 వేల చొప్పున మంజూరు చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో ఏఈ రసూల్, ఏపియం సునీత పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలి..

అఖిలపక్ష సమావేశంలో మారుతి 6న ధర్నాను జయప్రదం చేయాలని పిలుపు

విశాలాంధ్ర-వినుకొండ: జగనన్న కాలనీ ఇళ్ల లబ్ధిదారులకు ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని, రాష్ట్రంలో నిర్మించి ఉన్న టిడ్కో గృహాలను మౌలిక వసతులు ఏర్పాటుచేసి వెంటనే పంపిణీ చేయాలని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ అన్నారు. వినుకొండ పట్టణంలోని శివయ్య భవన్లో శుక్రవారం నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు అధ్యక్షత జరిగిన అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశానికి ఆయన పాల్గొని మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికలప్పుడు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. నిరుపేదలకు 30 లక్షలు మందికి ఒక సెంటు స్థలం చొప్పున పట్టాలిచ్చినప్పటికిని వారందరికీ ప్రభుత్వమే ఉచితంగా గృహాలు నిర్మించి ఇస్తామని ముఖ్యమంత్రి చేసిన వాగ్దానాన్ని విస్మరించి రూ.లక్ష80వేలు మాత్రమే ఇస్తూ వారినే ఇల్లు కట్టుకోవాలంటూ అధికారులతో తీవ్రమైన ఒత్తిళ్లకు గురి చేస్తున్నారని, లేకుంటే సంక్షేమ పథకాలు రాకుండా చేస్తామని, లబ్ధిదారుల లిస్టు నుండి మిమ్ములను తొలగిస్తామని, పట్టాలు వెనుకకు తీసుకుంటామని వారిని బెదిరించడం చాలా అన్యాయమని అన్నారు. ఒక సెంటు స్థలమునే పట్టాలుగా తీసుకున్న పేద ప్రజలు ఇల్లు నిర్మించుకోలేక వడ్డీలకు అప్పులు చేసి నానా అవస్థలు పడుతున్నారని అయిన ఒక్కొక్క ఇంటికి రూ.7 లక్షలపైనే ఖర్చు అవుతుందని లబ్ధిదారులు చెబుతున్నారని ఆ డబ్బు సమకూర్చుకోలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని అందువల్ల నిర్మాణం పూర్తి కావడంలేదని ఆయన అన్నారు. కావున రాష్ట్ర ప్రభుత్వం జగనన్న కాలనీ ఇళ్ల లబ్ధిదారులకు కనీసం ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని సిమెంటు ఇనుము ఇసుక ఉచితంగా ఇవ్వాలని, అలాగే రాష్ట్రవ్యాప్తంగా 90 శాతం పైబడి నిర్మించి ఉన్న టిడ్కో గృహాలను మౌలిక వసతులు ఏర్పాటు చేసి వెంటనే పంపిణీ చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పై డిమాండ్ల సాధన కొరకు పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఫిబ్రవరి 6న జరిగే ధర్నాలో అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో పాల్గొన్న అఖిలపక్ష నాయకులు టిడిపి నాయకులు పి.వి. సురేష్, సిపిఎం నాయకులు బొంకూరు వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు ఆర్కే నాయుడు, ఏపీ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము, సురేష్ రాజా, జనసేన నాయకులు శ్రీను, ఏఐవైఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి బూదాల సాగర్, ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రసన్న కుమార్, మాల మహానాడు నాయకులు పిడుగు విజయ్, తదితరులు మాట్లాడారు. గత ప్రభుత్వంలో కట్టుకున్న ఇళ్లకు చివరి దఫా ఇవ్వవలసిన బిల్లులను కూడా ఈ ప్రభుత్వం చెల్లించవలసిన బాధ్యత ఉందని ఆ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ పట్టణ మాజీ కార్యదర్శి, ఏరియా నాయకులు పఠాన్ లాల్ ఖాన్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పిన్నిబోయిన వెంకటేశ్వర్లు, సీపీఎం నాయకులు మదార్ వలి, జనసేన నాయకులు శ్రీనివాస్, సీపీఐ నాయకులు ఆర్.వందనం, ఎ.పవన్ కుమార్, బి. సాగర్, షేక్ మస్తాన్, నూలి పుల్లయ్య, కె.మల్లికార్జున, యూనిస్, జె.వెంకటేశ్వర్లు, నల్లబోతు శ్రీను, రమణయ్య, సాంబయ్య, సుందర్ రావు, చంద్రశేఖర్, యోహాన్, రాగమ్మ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పోరాటాల్లో ఆటో కార్మికులు పాల్గొనాలి: పుప్పాల

విశాలాంధ్ర-అమరావతి : ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన కార్మిక వ్యతిరేక చట్టాలపై, కార్మికులపై రోజురోజుకు జరుగుతున్న దాడులను వ్యతిరేకిస్తూ వారి హక్కుల పరిరక్షణ కోసం జరిగే కార్మిక పోరాటాలలో ఆటో యూనియన్ డ్రైవర్లు, కార్మికులు పాల్గొనాలని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు పుప్పాల సత్యనారాయణ పిలుపునిచ్చారు. అమరావతిలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన అమరావతి ఆటో డ్రైవర్స్ యూనియన్ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సమావేశానికి యూనియన్ గౌరవాధ్యక్షులు భైరాపట్నం రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పుప్పాల సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలకు రోజువారి రేట్లు పెంచడం వలన ఆయిల్ రేట్లు పెరిగి ఆటో కార్మికులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. అంతేకాకుండా రవాణా చార్జీలు పెరిగి నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని అన్నారు. రవాణా రంగ వ్యతిరేక నిర్ణయాలు కేంద్ర ప్రభుత్వం తీసుకోవడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం అనేక రకాలుగా రవాణా రంగంపై పెనాల్టీలు, గ్రీన్ టాక్స్, చలానా ఫీజులు, భారీగా అపరాధ రుసుముల ద్వారా వేల కోట్ల రూపాయలు భారాలు కార్మికులపై మోపారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు మూడు నెలల త్రైమాసిక పన్నును 30 శాతం దాకా భారీగా పెంచడం వల్ల వాహనదారులు టాక్సులు చెల్లించలేక వాహనాలు అమ్ముకోవడం జరుగుతుందన్నారు. చదువుకొని ఉద్యోగాలు లేక స్వయంకృషితో ఆటోలు నడుపుకొని జీవనం సాగిస్తున్న అనేకమంది డ్రైవర్లు రోడ్డున పడే ప్రమాదం ఉందని ఇప్పటికైనా త్రైమాసిక 30 శాతం టాక్సును రద్దు చేయాలని ఫైనాన్సర్ల బారి నుంచి కాపాడుట కోసం జీరో వడ్డీతో బ్యాంకులలో రుణాలు ఇప్పించి ఆదుకోవాలని, ఆటో రంగాన్ని పరిశ్రమగా గుర్తించి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ఈఎస్ఐ, పీఎఫ్‌తో కూడిన సదుపాయాలు కల్పించాలని, ఈ చలానాల వ్యవస్థ రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెదకూరపాడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఒక్క కార్మికుడు కాకి డ్రెస్ వేసుకోవాలని, లైసెన్స్ కలిగి, సి-బుక్ ఫర్ఫెక్ట్‌గా ఉండేలా చూసుకోవాలన్నారు. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపించినచో పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. కార్మికుల హక్కుల కోసం ఐక్య ఉద్యమాలు నిర్వహించాలని కోరారు. అనంతరం ఆటో యూనియన్ జిల్లా నాయకులు మస్తాన్ మాట్లాడారు. ఈ సందర్భంగా రవికోటిలింగాన్ని యూనియన్ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో మహిళాభివృద్ధిని విస్మరించారు: నిర్మల

విశాలాంధ్ర-చిలకలూరిపేట : కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మహిళాభివృద్ధిని పూర్తిగా విస్మరించారని ఏపీ మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల విమర్శించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై చెరుకుపల్లి నిర్మల మాట్లాడుతూ సగభాగం ఉన్న మహిళల అభివృద్ధికి, వారి భద్రతకు ఎటువంటి కేటాయింపులు లేవన్నారు. గ్రామీణ పేదలు, ద్రవ్యోల్బణం, నిరుద్యోగ సమస్య వంటి సమస్యల ప్రస్తావనే లేదని ఆరోపించారు. మహిళల రిజర్వేషన్ బిల్లు దశాబ్దాలుగా పెండింగ్‌లోనే ఉందని, మహిళ ఆర్థిక మంత్రిగా ఉన్నా వారి సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధి కరువైందన్నారు. కేంద్ర ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను ప్రజా వ్యతిరేక, చీకటి బడ్జెట్ అని, పేద లకు వ్యతిరేకంగా దీన్ని తీర్చిదిద్దారని మండిపడ్డారు. విభజన హామీల అమలు ప్రస్తావనే లేదని, పోలవరం విషయం పూర్తిగా విస్మరించారని, రాష్ట్రానికి ఈ బడ్జె ట్‌తో తీవ్ర అన్యాయం జరిగింద న్నారు. పేదలకు అన్యాయం చేస్తూ, కార్పొరేట్లకు మాత్రం అనుకూలంగా బడ్జెట్‌ను కేంద్రం రూపొందించిందని విమర్శించారు. బడ్జెట్‌లో నేడు దేశంలో ముఖ్యమైన నిరుద్యోగ సమస్య తీసుకోనేలేదు. అలాగే ఇప్పటికే అప్పుల్లో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్న రైతులకు సహాయం ప్రకటించకుండా ద్రోహం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామీణ ఉపాధికి గతేడాది కన్నా 40 శాతానికి పైగా నిధులు తగ్గిం చారని తెలిపారు. సంక్షేమ పథకాలను ఎత్తివేస్తూ, ఉపాధి నిధుల తగ్గించటం దారుణమన్నారు. కోవిడ్ తర్వాత వలస వెళ్లిన పేదలు దాదాపు 19 కోట్ల మంది గ్రామాల్లో రెక్కల కష్టమే జీవనాధా రంగా బతుకుతుంటే ఉపాధి హామీకి నిధులెట్లా తగ్గిస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వాలను నిర్వీర్యం చేస్తూ ఒంటెద్దు పోకడలతో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. ఏ రంగాన్ని కూడా మేలు చేయని ఘోరమైన కేంద్ర బడ్జెట్ ఇది అన్నారు.

ధనలక్ష్మి వ్యాయామ కళాశాల విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-ఈపూరు : నేటి పోటీ ప్రపంచంలో పిల్లల నెత్తిన చదువుల భారం ఎక్కువైందని, చదువుతో పాటు ఉల్లాసంగా ఆటలు, పాటలు, నృత్యాలు, సాంస్కృతి కాంశాలలో పిల్లలను తీర్చిదిద్దే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ధనలక్ష్మి వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చుండు వెంకట్రావు అన్నారు. మండలంలోని ముప్పాళ్ళ ధనలక్ష్మి వ్యాయామ కళాశాలలో బీపీఈడి మొదటి సంవత్సరం విద్యను అభ్యసిస్తున్న కె.భాను ప్రకాష్ ద్వితీయ సంవత్సరం ఎంపీఈడీ విద్యను అభ్యసిస్తున్న ఎల్.శ్రీకాంత్ రెడ్డిలు టార్గెట్ బాల్ పురుషుల విభాగంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ జట్టుకు ఎంపికయ్యారని, జనవరి 27న ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వ్యాయామ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ కళాశాలల టార్గెట్ బాల్ పోటీలలో తమ కళాశాల విద్యార్థులు ఇరువురు అత్యంత ప్రతిభ కనపరిచి ఈ నెల 8, 9 తేదీలలో వైజాగ్‌లోని గీతం యూనివర్సిటీలో జరిగే అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలకు అర్హత సాధించారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి మంచిగా చదువుకొని భవిష్యత్తులో అత్యున్నత స్థాయికి ఎదగాలని, క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కష్టపడి తాము అనుకున్న రంగాల్లో రాణించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సొంత ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం ఇరువురు విద్యార్థులను కళాశాల సెక్రటరీ మరియు కరస్పాండెంట్ మేదరమెట్ల రామశేషగిరిరావు, కళాశాల అధ్యాపకులు వై.సురేష్, ఆర్.బలరాం నాయక్, ఎం.సురేష్ కుమార్, ఎం.దాసు తదితరులు అభినందించారు.

టీడీపీ ముస్లిం మైనారిటీల ఆత్మీయ సదస్సు విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-పిడుగురాళ్ల : ఈ నెల 5వ తేదీన దాచేపల్లిలో జరిగే ముస్లిం మైనారిటీల ఆత్మీయ సదస్సు విజయవంతం చేయాలని పల్నాడు జిల్లా మైనార్టీ అధ్యక్షులు సయ్యద్ అలీ కోరారు. శుక్రవారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆత్మీయ సదస్సు ఫ్లెక్సీ ఏర్పాటు చేసి అనంతరం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హయాంలో గురజాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీలకు ఒక స్వర్ణ యుగంలా ఉండేదన్నారు. మైనార్టీలకు అండగా రంజాన్ తోఫా, దుల్హన్ పథకం, మైనార్టీ కార్పొరేషన్ ద్వారా ఎంతోమందికి అండగా నిలిచారన్నారు. అదేవిధంగా శ్రీనివాసరావు హజ్ యాత్రకు వెళ్లే పేద ముస్లిం సోదర సోదరీమణులకు సొంత డబ్బులు ఒక్కొక్కరికి లక్ష రూపాయలు చొప్పున 48 మందిని మక్కా పంపించారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముస్లింల సంక్షేమ పథకాలను తీసివేయటం కాకుండా గురజాల నియోజకవర్గంలో ముస్లింలపై పెద్దఎత్తున దాడులు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పలనాడు జిల్లా ముస్లిం మైనార్టీ అధ్యక్షులు సయ్యద్ అమీర్ అలీ, పిడుగురాళ్ల పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ మస్తాన్ వలి, నియోజకవర్గ పల్నాడు జిల్లా మైనార్టీ సెల్ అధికార ప్రతినిధులు గుత్తికొండ సుభాని, ప్రింటింగ్ సైద, మండల తెలుగు యువత అధ్యక్షులు షేక్ ఖాసిం సైదా తదితరులు పాల్గొన్నారు.

చౌక్ బాల్ పోటీలకు ఏఎంజీ కళాశాల విద్యార్థుల ఎంపిక

విశాలాంధ్ర-చిలకలూరిపేట: స్వచ్ఛంద సేవా సంస్థ ఏఎంజీకి చెందిన మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థులు జాతీయస్థాయి చౌక్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ చౌక్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న ఎం.హదస్స, టి.జ్యోతిర్మయి, టి.అంజలిలు తమ ప్రతిభను కనపరిచారు. దీంతో వీరిని జాతీయ స్థాయి పోటీలకు వెళ్లే జట్టులో ఎంపిక చేశారు. వీరు హైదరాబాదులో ఈ నెల 4, 5 తేదీల్లో జరిగే జాతీయస్థాయి చౌక్ బాల్ పోటీల జట్టులో రాష్ట్రం తరఫున ఆడనున్నారు. వీరిని ఏఎంజి సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణ్ కుమార్ మహంతి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పి.లావణ్య అభినందించారు.

పల్నాడు ప్రాంత అభివృద్ధికి సహకారం : మంత్రి

విశాలాంధ్ర-నరసరావుపేట: పల్నాడు ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాల సహకరిస్తుందని, నూతనంగా ఏర్పడిన పల్నాడు జిల్లా అర్బన్ డెవలెప్మెంట్ అథారిటీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న మిట్టపల్లి రమేష్ తన పదవికాలంలో పల్నాడు ప్రాంత అభివృద్ధికి పాటుపడాలని పుర పాలక శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. పట్టణంలోని జమీందార్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం జరిగిన పల్నాడు జిల్లా అర్బన్ డెవలెప్మెంట్ అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్ ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రి ఆదిమూలపు సురేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సభకు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించారు. సభలో మంత్రి సురేష్ మాట్లాడుతూ రమేష్‌కు హుడా చైర్మన్ పదవి రావటానికి ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ముఖ్య భూమికను పోషించారన్నారు. ఈ పదవితో మిట్టపల్లి కుటుంబ సభ్యులకు మరింత బాధ్యతలు పెరిగాయని అన్నారు. మిట్టపల్లి కుటుంబంపై ఎంతో గౌరవం ఉందన్నారు. రానున్న రోజుల్లో కూడా ఇలాంటి ప్రభుత్వమే ప్రజలకు అవసరమని అన్నారు. ప్రజల గుండెల్లో సీఎం చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. రాష్ట్రం ఇప్పటికే 20 అర్బన్ డెవల్మెంట్ అథారిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. రాష్ట్రంలో మున్సిపాలిటీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.3వేలు కోట్లు విడుదల చేసిందని, నర్సరావుపేట ప్రజలకు డాక్టర్ గోపిరెడ్డి లాంటి ఎమ్మెల్యే ఉండటం అదృష్టమని అన్నారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పార్టీని నమ్ముకున్నవారికి న్యాయం చేస్తారని, మంచి పదవులు ఇస్తారని అన్నారు. మిట్టపల్లి రమేష్ పార్టీకి అండగా ఉంటూ పార్టీ నిర్ణయాలను చిరసావహిస్తూ అన్ని కార్యక్రమాలను విజయవంతం చేశారన్నారు. డీఆర్వో వినాయకం మిట్టపల్లి రమేష్‌తో హుడా చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ పల్నాడు ప్రాంత అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే గోపిరెడ్డి, ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు, సీఎం జగన్మోహన్ రెడ్డి, జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ స్పీకర్ కోలగొట్ల వీరభద్రస్వామి, ఎమ్మెల్యేలు వెల్లంపల్లి శ్రీనివాస్, నంబూరు శంకరరావు, బొల్లా బ్రహ్మానాయుడు, కాసు మహేష్ రెడ్డి, మద్దాళి గిరిధర్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, మాజీ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్, ఎన్వి రాన్‌మెంట్ మేనేజర్ స్టేట్‌పర్సన్ గుబ్బా చంద్రశేఖర్, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు ముక్కాల ధ్వారకానాథ్, కుప్పం ప్రసాద్, మిట్టా కరుణాకర్, షేక్ ఖాజావలి, మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్ఎమ్ అనిల్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ సుజాత పాల్, ఎంపీపీ అధ్యక్షులు మోరబోయిన శ్రీనివాస్, జడ్పీటీసీలు చిట్టిబాబు, పిల్లి ఓబుల్ రెడ్డి, స్టేట్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ చింతా కిరణ్ కుమార్, ఎస్ఈసీ విద్యాసంస్థల చైర్మన్ మిట్టపల్లి కోటేశ్వరరావు, రొంపిచర్ల మార్కెట్ యార్డు చైర్మన్ పచ్చవ రవీంద్రబాబు, సాధు ప్రసాద్, ఆంజనేయులు, డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డితో పాటు జిల్లాలోని ఆర్యవైశ్యులు, వైసీపీ నాయకులు, పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో ఎమ్మెల్యే గోపిరెడ్డి, మిట్టపల్లి రమేష్ మేళతాళాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ప్రమాణ స్వీకారానికి జిల్లా మంత్రులు విడదల రజిని, అంబటి రాంబాబు, ప్రభుత్వ చీఫ్ విప్ పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి గైర్హాజరయ్యారు.

గొల్లమూడి సైదమ్మకు సీపీఐ నివాళి

విశాలాంధ్ర-పిడుగురాళ్ళ : పిడుగురాళ్ల మండలం జూలకల్లు గ్రామంలో గొల్లమూడి సైదమ్మకు పార్టీ పతాకం కప్పి పూలమాలలు వేసి గురజాల నియోజకవర్గ సీపీఐ నాయ కులు నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కమ్యూనిస్టు పార్టీ నాయకులు తెల్లనాకుల సత్య నారాయణ మాట్లాడుతూ చిన్న వయసులోనే సైదమ్మ తన భర్తను కోల్పోయినప్పటికీ మరొక రిని వివాహం చేసుకోకుండా నిరంతరం పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ తమలాంటి వాళ్లకి ఆదర్శంగా నిలిచారన్నారు. సైదమ్మ భర్త నారాయణ 1949లో రహస్యంగా పార్టీ ఆదేశాలను అమలుపరుస్తుండటంతో 1950లో అరెస్టు చేసి పోలీసులు కాల్చి చంపారని గుర్తుచేసుకున్నారు. అప్పట్లో నారాయణ ఆధ్వర్యంలో కమ్యూనిస్టు పార్టీకి తిరుగులేకుండా ఉండటంతో దాచేపల్లిలో ఆయన పేరుతో నారాయణపురం అని గ్రామంలో కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తాము కూడా కమ్యూనిస్టు సిద్ధాంతాలను అనుసరిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నామన్నారు. సైదమ్మకు నివాళులర్పించిన వారిలో సీపీఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్, గురజాల నియోజకవర్గ కార్యదర్శి మందపాటి రమణారెడ్డి, పిడుగురాళ్ల పట్టణ కార్యదర్శి జె.కృష్ణ నాయక్, దాచేపల్లి మండల కార్యదర్శి కొమర వెంకటరావు, దామరచర్ల హనుమంతరావు తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

విశాలాంధ్ర-దుర్గి : దుర్గిలో పాతస్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్స్ వద్ద ఫీజ్ బాక్స్ ఏర్పాటు నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ ఏఈ ఎం.రాంబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. కావున దుర్గి ప్రజలు విద్యుత్ సరఫరా ఉన్న సమయంలో తమ అవసరాలను తీర్చుకోవాలని కోరారు.

అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా లక్ష్మీరాజ్యం

విశాలాంధ్ర-విజయ పురిసౌత్ : స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా ఎం.లక్ష్మీరాజ్యం గురువారం నియామక బాధ్యతలను చేపట్టారు. ఇప్పటివరకు పాఠశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న దేవరకొండ బాలకృష్ణ జనవరి 31వ తేదీన పదవి విరమణ కావడంతో ఇదే పాఠశాలలో వైస్ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న మచ్చ లక్ష్మీరాజ్యం ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ లక్ష్మీరాజ్యం మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా కృషి చేస్తానన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రిన్సిపాల్ లక్ష్మీరాజ్యంను పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందించారు.

మహారాజశ్రీ గురజాల సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P NO 11/2021 IN O.S 170/2015

పల్లె బోయిన వెంకటేశ్వర్లు - D.H.R

వర్సెస్,

గెనికల హనుమంతరావు - జె.డి.ఆర్.

జె.డి.ఆర్‌కు చెందిన దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తులను దీ.22-2-2023న పై కోర్టులో బహిరంగ వేలం జరుపబడును. కావలసినవారు పైకోర్టులో పై తేదీన జరుగుబహిరంగ వేలంలో పాల్గొనవలసిందిగా యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూల్ : అయిటం నెం. 1 : ఇంటి ఆస్తి దీనిని వేలం నుండి మినహాయించడమైనది.

అయిటం నెం.2 : నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, మాచర్ల సబ్ రిజిస్ట్రార్ వారి ఇలాకా, ముటుకూరు రెవెన్యూ గ్రామంలోని సర్వే నెం. 1047లోని యు.1.90 సెంట్లు మెట్ట భూమికి హద్దులు : తూర్పు : కొప్పుల పెద్ద సైదయ్య భూమి, దక్షిణం : మాదాసు హనుమంతరావు భూమి, పడమర : కొప్పుల రామస్వామి మరియు నాగేంద్ర శ్రీనుల భూమి ఉత్తరం : బండి వెంకటేశ్వర్లు మరియు నాగెంద్ర శ్రీనుల భూమి డీ.హెచ్.ఆర్ విలువ .... రు. 1,00,000/-లు. అమీనా విలువ ...... రూ.2,00,000/-

అయిటం నెం.3 : నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా మాచర్ల సబ్ రిజిస్టర్ వారి ఇలాకా ముటుకూరు రెవిన్యూ గ్రామంలోని సర్వే నెం.1219 లోని యు.2.62 సెంట్లు మెట్ట భూమికి హద్దులు : తూర్పు : గొర్రెపాటి వెంకటేశ్వర్లు భూమి. దక్షిణం : మాదాసు ఎర్ర కొండయ్య భూమి పడమర : కుందుర్తి చెన్నయ్య భూమి ఉత్తరం : దేవరకొండ చిన్న హనుమయ్య భూమి డీ.హెచ్.ఆర్ విలువ ...... రు.1,00,000/- అమీనా విలువ .... రు. 2,00,000/-

చల్లా రామిరెడ్డి, గొర్రె వెంకటేశ్వర్లు, నిమ్మల శ్యామలాదేవి

గురజాల. డి.హెచ్.ఆర్ తరపున న్యాయవాదులు.

3-2-23. సెల్ : 9908197630.

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం స్కూళ్లల్లో సెలవులు అమలు చేయాలి

విశాలాంధ్ర-నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఉన్న ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలల యాజమాన్యాలు సెలవులు తప్పనిసరిగా అమలు చేయాల్సిందే నని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరి రక్షణ కమిషన్ సభ్యులు బి.పద్మావతి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని స్పందన హాలులో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యాన శుక్రవారం పల్నాడు జిల్లా ప్రైవేటు, కార్పొరేటు పాఠశా లల యాజమాన్యాలతో బాలల హక్కులు చట్టాలపై అవ గాహన, సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో హాజరైన కమిషన్ సభ్యులు పద్మావతి మాట్లాడుతూ ప్రధా నంగా ప్రైవేటు,కార్పొరేటు పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు ఎన్ని రకాల హక్కుల సంభందించిన ఉల్లం ఘనలు ఎదుర్కొంటున్నట్లు తమ కమిషన్ దృష్టికి అధిక సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్నాయని అన్నారు. ఇటు వంటి పాఠశాలల వివరాలు గోప్యంగా సేకరించి ప్రభు త్వం దృష్టికి తీసుకు వెళుతున్నట్టు చెప్పారు. ప్రభుత్వ నియమాలకు అనుగుణంగా ప్రతీ నెల రెండో శనివారం, ప్రతీ ఆదివారం సెలవులు, వివిధ పండగలు సెలవులు అమలు పర్చాల్సిందేనని అన్నారు. సెలవు దినాల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు, ప్రత్యేక పరీక్షలు పేరుతో ఒత్తిడికి గురిచేస్తున్నట్టు ఆధారాలతో తల్లిదండ్రులు, విద్యార్థులు, బాలల సంఘాల ప్రతినిధులు కమిషన్ దృష్టికి తీసుకువస్తే తక్షణమే ఆయా పాఠశాలల గుర్తింపు రద్దు చేసేందుకు త్వరితగతిన ఆయా జిల్లాల విద్యాశాఖాధికారులకు, రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు, నివేదికలు అందజేయనున్నామని అన్నారు. ఈ సెలవులు అన్ని పాఠశాలల యాజమాన్యాలుకు వర్తిస్తాయని, ఏ పాఠశాలకు, యాజమాన్యానికి మినహాయింపులు ఉండబోవని అన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. క్రీడా మైదానాల్లో ఆటలు ఆడిపించేలా చర్యలు చేపట్టాలని విద్యాశాఖాధికారులకు ఆదేశిస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో పిల్లల హక్కులకు ఎక్కడైనా విఘాతం కలిగితే కమిషన్ యుద్ధప్రాతిపదికన స్పందించి చర్యలకు సిఫారసులు చేయనున్నామని అన్నారు. జిల్లా విద్యా శాఖాధికారి మేకతోటి వెంకటప్పయ్య మాట్లాడుతూ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సూచించిన అంశాలన్ని అమలు జరిగేలా యాజమాన్యాలను సంఘటిత పరిచే ఆదేశాలు జారీచే స్తున్నామని అన్నారు, వీటి అమలు తనిఖీ బృందాలను నియమిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ పిడి అరుణ, జిసిడివి రేవతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సాయంతో ప్రయోజకులు కావాలి

విశాలాంధ్ర - బాపట్ల : ప్రభుత్వం విద్యాభ్యాసానికి అందిస్తున్న సాయంతో ప్రయోజకులు కావాలని కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. జగనన్న విదేశీ విద్యాదీవెన ప్రథకం లబ్ధిదారులకు శుక్రవారం కలెక్టరేట్‌లో చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కల్పించే అవకాశాలతో మీ జీవితాలను చక్కగా తీర్చిదిద్దుకోవాలన్నారు. జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం కింద బాపట్ల జిల్లాలో ఇ.బి.సి. విద్యార్థులు ఆరుగురు, బి.సి. విద్యార్థి ఒకరు, మైనార్టీ విద్యార్థి ఒకరు లబ్ధిపొందుతున్నారని వివరించారు. వీరికోసం మొదటి విడతగా రూ.79,09,379లు నగదును బాపట్ల జిల్లాకు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆమె ఆకాంక్షించారు. చదువుకోవడానికి పేదరికం అడ్డురాకూడదని ప్రభుత్వం గొప్ప అవకాశాలను కల్పించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం జిల్లాలోని లబ్ధిదారులైన విద్యార్థులకు చెక్కు రూపంలో ఆర్థిక సహాయం నగదును కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ శ్రీనివాసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారిణి రాజదెబోరా, జిల్లా బి.సి. సంక్షేమ శాఖ అధికారిణి కల్పన, జిల్లా ఎస్టీ సంక్షేమ శాఖ అధికారి సైదా దస్తగిరి, సహాయ సంక్షేమ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అదానీని అరెస్టు చేయాలి: కాంగ్రెస్

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : మోడీ అమిత్‌షాల దత్తపుత్రుడు అదానీ హిండెన్ బర్గ్ నివేదికపై సమాధానం చెప్పాలని బాపట్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శుక్రవారం బాపట్ల జిల్లా అధ్యక్షులు గంటా అంజిబాబు ఆదేశాల మేరకు పట్టణ కాంగ్రెస్ కమిటీ సమావేశమై 2023 బడ్జెట్‌లో రాష్ట్రానికి, పోలవరానికి, ప్రత్యేక హోదా గురించి ప్రస్తావన లేకపోవడంపై తీవ్ర విమర్శలను గుప్పించారు. ఈ సందర్భంగా మైనార్టీ జిల్లా అధ్యక్షులు పటాన్ రాజేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ చేతగానితనం వల్ల వ్యక్తిగత కేసులతో రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టారని పేర్కొన్నారు. అలాగే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అదానీ అడిగిన వెంటనే అప్పనంగా ఆర్థిక ప్రోత్సాహకాలు అందించి వేల కోట్ల బ్యాంకు రుణాలు ఇప్పించి ఈ రోజు హిండెన్ బర్గ్ నివేదిక ప్రకారం దేశ ప్రజల సొమ్ముకు నష్టం కలిగించి దేశ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేశాడని ఆరోపించారు. అదేవిధంగా హిండెన్ బర్గ్ నివేదికపై మోడీ, అమిత్ షా,ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నోరు మెదకపోవడంపై నివేదిక నిజమని తేటతెల్లమైందన్నారు. తక్షణమే అధానిని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ బాపట్ల మండల రెవిన్యూ ఆఫీసులో డి.టి కె శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ అధ్యక్షులు పఠాన్ రాజేష్, పట్టణ మహిళా అధ్యక్షురాలు దండు రేణుక, బీసీ సెల్ నాయకులు నక్కల రాంబాబు, ఎస్సీ సెల్ టౌన్ ప్రెసిడెంట్ ఇస్సాకు, జిల్లా సెక్రెటరీ సాగర్,కట్ట. లాజర్, సురేష్, బుర్ర విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యులకు అండగా ఫ్రెండ్ ఆర్గనైజేషన్

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : ఆపదలో ఉన్న వారికి అన్ని విధాలుగా అండగా నిలిచి చేయూతనిస్తామని ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ గౌరవాధ్యక్షులు వేజెండ్ల శ్రీనివాసరావు పేర్కొన్నారు. బాపట్ల పట్టణం 12వ వార్డులో చింత సుదేవ్‌కు చెందిన పూరిళ్లు అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలిపోయి, కట్టుబట్టలతో రోడ్డుపై నిలిచిన కుటుంబానికి ఆర్గనైజేషన్ తరపున రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వేజెండ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో వివిధ కారణాలతో ఆపదలో, ఆర్థిక ఇబ్బందులు పడుతూ సమస్యలు ఎదుర్కొంటున్న పేదవారికి ఆర్గనైజేషన్ సభ్యుల సహాయ సహకారాలతో అండగా నిలిచి తమకు తోచిన సహాయాన్ని అందిస్తున్నామని తెలియజేశారు. అదేవిధంగా ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం జరిగి సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి ప్రతి ఒక్కరు చేయూతనిచ్చి అండగా నిలవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బండ్రెడ్డి గోపి ఉపాధ్యక్షులు జంగం దాసు, ట్రెజరర్ సువర్ణరాజు, కత్తి రాజు, విన్నకోట శ్రీనివాసరావు, యాసం రాజా రమేష్ నల్లపాటి కిషోర్, చల్లా శ్రీకాంత్, బక్క దీపక్, నరాలశెట్టి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు రైతులకు ఉపయోగంగా ఉండాలి

విశాలాంధ్ర-పర్చూరు: ఉపాధి హామీ పనులు రైతులకు ఉపయోగార్థంగా ఉండాలని డ్వామా పీడీ శంకరనాయక్ తెలిపారు. శుక్రవారం మండలంలోని నాగులపాలెం, నూతలపాడు గ్రామాలలో జరుగుతున్న ఉపాధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులలో నాణ్యత ఉండాలని, సమయపాలన, కొలతలు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం తడిచెత్త, పొడిచెత్త కేంద్రాలను సందర్శించి, వర్మీ కంపోస్టు రైతులు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వీరివెంట ఎంపిడిఓ లక్ష్మీదేవి, ఏపీఓ బుల్లియ్య, ఉపాధిహామీ సిబ్బంది ఉన్నారు.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

విశాలాంధ్ర-జెపంగులూరు : సృష్టికర్త శ్రీ విశ్వకర్మ భగవానుడి పండుగ సందర్భంగా పంగులూరు మండల విశ్వ బ్రాహ్మణ సేవా సంఘ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విశ్వకర్మ బ్రాహ్మణుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పథకానికి కృతజ్ఞత గా భారత ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సంఘ అధ్యక్షులు తక్కెళ్ళపాటి రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర బిజెపి ఆర్టిజన్ సెల్ కన్వీనర్ కొండముది బంగారు బాబు, బాపట్ల జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘ ప్రధాన కార్యదర్శి వెంకటాపురం ఆచారి, జిల్లా ప్రచార కార్యదర్శి రవిచంద్ర, మండల సంఘ ప్రధాన కార్యదర్శి కొండముది ఆంజనేయులు, కోశాధికారి కోటపాటి శ్రీనివాసులు, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగేంద్ర ప్రసాద్, ఉత్సవ కమిటీ చైర్మన్ మురికిపూడి ఓంకార శర్మ, కందుకూరి మల్లికార్జున పాల్గొన్నారు. అనంతరం సంఘ గౌరవ సలహాదారులు జర్నలిస్ట్ మేడూరి శివప్రసాద్ బిజెపి నాయకులు బంగారు బాబు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటాపురం ఆచారిని ఘనంగా సత్కరించారు.

ప్రశాంతంగా మండల పరిషత్ అధ్యక్ష ఉప ఎన్నిక

అట్లా చిన్న వెంకటరెడ్డి వర్గం అధ్యక్ష స్థానం కైవసం

విశాలాంధ్ర-సంతమాగులూరు : మండలంలోని సంత మాగులూరు మండల పరిషత్ అధ్యక్ష స్థానాన్ని అట్లా చిన్న వెంకటరెడ్డి వ్యక్తిగత కారణాలవల్ల రాజీనామా చేయడంతో ఆస్థానానికి శుక్రవారం మండల పరిషత్ అధ్యక్ష ఉప ఎన్నిక ప్రత్యేక అధికారి చీరాల ఆర్డీవో సరోజిని అధ్యక్షతన నిర్వ హించారు. 17 ఎంపీటీసీలకు గాను ఒకరు రాజీనామా చేయడంతో 16 ఎంపీటీసీలలో 13 మంది ఎంపీటీసీలు హాజరవగా పాత మాగులూరు గ్రామానికి చెందిన ఎంపీటీసీ ఏనుబర్ల యలమంద మండల పరిషత్ అధ్యక్షునిగా వెల్లలచెరువు గ్రామానికి చెందిన ఎంపీటీసీ మోదేపల్లి శ్రీనివాసరావు ప్రతిపాదించగా మామిళ్ళపల్లి ఎంపీటీసీ గడిపూడి విజయ భాస్కర్ బలపరిచారు. మిగతావారు కూడా బలపరచడంతో అధ్యక్ష ఏకగ్రీవం అయింది. ఏనుబర్ల ఎల్లమందకు ఆర్డీవో సరోజిని ఆమోదపత్రం ఇచ్చారు. ఏల్చూరు గ్రామానికి చెందిన ఇద్దరు ఎంపీటీసీలు కుందూరు గ్రామానికి చెందిన ఎంపీటీసీ గైర్ హాజరయ్యారు. మొత్తానికి మండల పరిషత్ అధ్యక్ష ఉపఎన్నిక పోలీస్ బందోబస్తు మధ్య సీఐ శివరామకృష్ణారెడ్డి పర్యవేక్షణలో ముగిసింది. అక్కడికి విచ్చేసిన ఎంపీటీసీలకు ప్రభుత్వ అధికారులకు అట్లా చిన్న వెంకటరెడ్డి భోజనం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా వైసిపి అద్దంకి నియోజకవర్గ బాచిన కృష్ణచైతన్య ఎంపీడీవో సాంబ శివరావు, తహశీల్దార్ అశోకవర్ధన్ పాల్గొన్నారు.

CHANGE OF NAME
I, ESWARAMMA CHENNUPATI (Old Name) W/o. LAVU SRINIVASA RAO, R/o. D.No.2-42, Ananthavaram Village, Yeddanapudi Mandal, Bapatla District, Andhra Pradesh - 523301, have changed my name to **LAVU SUDHA**. Hereafter my name is known as **LAVU SUDHA**.

గుండ్లకమ్మ నదిలో ఇసుక తవ్వకాలకు ఆమోదం

- 6.54 చ.కి.మీలో ఇసుక లభ్యత
- జిల్లాలో ఏడు రేవులు గుర్తింపు
- జె.పి వెంచర్స్ సంస్థకు అనుమతులు
- కలెక్టర్ విజయకృష్ణన్

విశాలాంధ్ర - బాపట్ల : గుండ్లకమ్మ నదిలో డి సిల్టేషన్ ద్వారా ఇసుక తవ్వడానికి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆమోదించారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేస్తామని ప్రకటించారు. జిల్లాలోని వాగులు, వంకల్లో ఇసుక లభ్యతపై జిల్లాస్థాయి ఇసుక కమిటి సమావేశం శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అధ్యక్షతన జరిగిన కమిటి సమావేశంలో ఇసుక రేవులు, ఇసుక తవ్వకాలపై చర్చ సాగింది. గుండ్లకమ్మ నదిలో పూడికతీత ద్వారా ఇసుక తవ్వకాలకు (డి సిల్టేషన్) జిల్లాస్థాయి ఇసుక కమిటీ ఆమోదముద్ర వేసింది. ప్రజా అవసరాలకు తగినట్టుగా గుండ్లకమ్మ నదిలో ఇసుక లభ్యత వుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. నిబంధనల ప్రకారం గుర్తించిన ప్రాంతంలోనే ఇసుక తవ్వడానికి అనుమతులు ఉన్నాయన్నారు. ఇసుక తవ్వకాలకు వివిధ శాఖల అధికారులు పరిశీలించి సమర్పించిన నివేదికపై కలెక్టర్ చర్చించారు. అధికారుల నివేదిక ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాలననుసరించి గుండ్లకమ్మ నదిలో 6.54 చదరపు కిలోమీటర్ల పరిధిలో పూడికతీత ద్వారా ఇసుక తవ్వడానికి అవకాశం ఉందని చెప్పారు. ఆ ప్రాంతంలో 2,95,072 మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వడానికి అధికారికంగా ఆమోదిస్తున్నట్లు వివరించారు. దీంతో జిల్లాలోని ప్రజా అవసరాలకు ఇసుక అందుబాటులోకి వస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్యాకేజి-2 వద్ద ఇసుక తవ్వడానికి జె.పి. వెంచర్స్ సంస్థకు అనుమతులు ఉన్నాయన్నారు. త్వరలోనే ఇసుక తవ్వకాలు మొదలవుతాయన్నారు. బాపట్ల జిల్లాలోని వాగులు, వంకల్లో ఇసుక తవ్వకాలకు కొత్తగా ఏడు ఇసుక రేవులను గుర్తించామని తెలిపారు. అద్దంకి మండలంలోని వెంపరాల గ్రామం, నరసింహాపురం (గోపాలపురం), రామాయపాలెం, తిమ్మాయపాలెం, వేలమూరిపూడి, మోదేపల్లి గ్రామాలు, బల్లికురువ మండలంలోని వెలమవారిపాలెం గ్రామంలో ఇసుక రేవులను ప్రాథమికంగా గుర్తించామన్నారు. ఆ ప్రాంతంలో ఇసుక లభ్యత, ఇసుక తవ్వడానికి సాధ్యాసాధ్యాలపై సమగ్ర పరిశీలన చేసి స్పష్టమైన నివేదిక ఇవ్వాలని కమిటీలోని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాలో ప్రజలకు అవసరమైనంతా ఇసుక అందుబాటులోకి రానుందన్నారు. అనుమతులు లేని ప్రాంతాలలో ఇసుక తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనుమతులున్న రేవులలో చట్టబద్ధంగానే ఇసుక తవ్వకాలు జరిగేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లాస్థాయి ఇసుక కమిటీ సభ్యులు జిల్లా సంయుక్త కలెక్టర్ డాక్టర్ కె. శ్రీనివాసులు, అదనపు ఎస్పీ మహేష్, భూగర్భ గనుల శాఖ డి.డి. జగన్నాధరావు, గ్రౌండ్ వాటర్ డి.డి., సెబ్ డి.ఎస్.పి. నరసింహారావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకంకు బడ్జెట్‌లో భారీ కోత: జేబీ శ్రీధర్

విశాలాంధ్ర - బాపట్ల : కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంకు భారీ కోత విధించిందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జేబీ శ్రీధర్ విమర్శించారు. బాపట్ల పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కేవలం రూ. 60 వేల కోట్లు కేటాయించడం గ్రామీణ పేదలను కష్టజీవులను తీవ్రంగా మోసగించటమే అన్నారు. 2020-21 బడ్జెట్‌లో రూ. 98వేల కోట్లు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం 2022-23 బడ్జెట్లో రూ. 25 వేల కోట్లు తగ్గించి 73 వేల కోట్లు కేటాయించగా ప్రస్తుతం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మరో రూ.13 వేల కోట్లు తగ్గించి 60 వేల కోట్లు కేటాయించడం చాలా ఘోరమైన చర్యగా ఆయన పేర్కొన్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ముసుగులో బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చడం కోసం ప్రతి ఏడాది బడ్జెట్లో కోత పెడుతుందని ఆయన విమర్శించారు. ఓ పక్క వ్యవసాయ రంగానికి అన్యాయం చేస్తూ మరోపక్క గ్రామీణ పేదలతో పాటు ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని బీకేఎంయు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుందన్నారు. కేంద్ర బడ్జెట్లో ఉపాధి హామీ పథకానికి రెండు లక్షల కోట్లు నిధులు కేటాయించాలని ఉపాధి లేని కూలీలకు ఏడాదికి 200 పని దినాలు కల్పించి రోజు కూలీ రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ బడ్జెట్‌లో కార్పొరేట్ శక్తులకు పెద్దపీట వేసి గ్రామీణ పేదలకు కష్టజీవులకు పట్టణ పేదలకు కష్టాలు మిగిల్చే విధంగా ఉందని జేబీ శ్రీధర్ పేర్కొన్నారు. అధిక ధరలను అరికట్టడానికి ఆహార భద్రతకు బడ్జెట్లో సరైన కేటాయింపులు లేవని, రానున్న రోజుల్లో ఎన్నికలు జరగనున్న గుజరాత్, కర్ణాటక రాష్ట్రాలకు అధిక కేటాయింపులు చేశారని ఆయన మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం అన్ని విధాల అన్యాయం చేసిందని ఈ బడ్జెట్ పేదలకు తీవ్ర అన్యాయం చేసే బడ్జెట్ అన్నారు.

పేదలను ఆదుకోండి..

బాపట్ల జిల్లా సీపీఐ కార్యదర్శి తన్నీరు సింగరకొండ

విశాలాంధ్ర-చీరాల : జగనన్న కాలనీలలో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇస్తున్న లక్ష ఎనభైవేలు పేదలకు సరిపోవట్లేదని ఐదు లక్షలకు పెంచాలని, ఇంటికి అవసరమయ్యే సిమెంట్, ఇసుక, ఇనుము, కిటికీలు ఉచితంగా లబ్ధిదారులకు ఇవ్వాలని సిపిఐ బాపట్ల జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ అన్నారు. శుక్రవారం చీరాల నగర్ లే ఔట్లలో సీపీఐ నాయకులు పర్యటించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలందరికి ఇళ్ల పేరుతో జగనన్న కాలనిలలో స్థలం కేటాయించి గృహ నిర్మాణానికి ప్రభుత్వం ఆర్థిక సహకారం అందిస్తుందని అయితే అన్ని గృహ నిర్మాణాల వస్తువుల ధరలు పెరిగిపోయి పేదలు ఇళ్లను ఇళ్ల కట్టుకోలేని పరిస్తితి ఏర్ప డిందని అన్నారు. ఇంటి నిర్మాణానికి అవసరమయ్యే సిమెంట్, స్టీల్, ఇటుకలు, ఇసుక, కంకర, కిటికీలు, తలుపుల ధరలు, కూలీల ధరలు పెరగడంతో పేదలు బయట వడ్డీకి తెచ్చుకుని ఇళ్ల నిర్మాణాలు చేపడుతూ ఇంటి అద్దె చెల్లించలేక, ఇంటి నిర్మాణం చేపట్టలేక తీవ్ర మనోవేదనకు గురౌతున్నారని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన కాలనిలలో కనీస మౌలిక వసతులు లేవని,సరైన రోడ్లు,నీరు,కరెంటు, వంటివి లేవని గుడికి బడికి స్థలం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బత్తుల శామ్యూల్,సీపీఐ ఏరియా కార్యదర్శి సి హెచ్ ప్రకాష్, సీపీఐ సీనియర్ నాయకులు మేడ వెంకట్రావు, వేటపాలెం మండల కార్యదర్శి డి వెంకటేశ్వర రెడ్డి, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు అచ్యుతుని బాబురావు, ఏఐఎస్ఎఫ్ నాయకులు తన్నీరు విజయ్ పాల్గొన్నారు.

మూగజీవులకు కొండంత భరోసా

విశాలాంధ్ర-బల్లికురవ : రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పశువుల ఆరోగ్య సంరక్షణ దిశగా డాక్టర్ వైయస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ పథకం ద్వారా మూగజీవాలకు నాణ్యమైన వైద్యం అందించాలని దృఢ సంకల్పంతో మూగజీవాల వైద్యం కోసం అంబులెన్స్ ఏర్పాటు చేయడం ద్వారా మూగజీవాల ప్రాణాలకు కొండంత భరోసా దొరికిందని శాప్ నెట్ చైర్మన్ అద్దంకి నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బాచిన కృష్ణ చైతన్య అన్నారు. శుక్రవారం బల్లికురవ పశువైద్యశాల వద్ద డాక్టర్ వైయస్సార్ సంచార పశు వైద్యశాల వాహనమును ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ దేశంలో ఎక్కడలేని విధంగా మూగజీవాల సంరక్షణ కోసం టోల్ ఫ్రీ 1962 నెంబర్ కి ఫోన్ చేయగానే అంబులెన్స్ నేరుగా రైతు ఇంటి వద్దకు వెళ్లి పశువులకు ఉచితంగా వైద్యం అందిస్తారన్నారు.పశువులకు మెరుగైన వైద్యం అవసరమైతే సమీప వైద్యశాలకు తరలించి వైద్య సేవలనంతరం పూర్తిగా కోలుకున్న తర్వాత తిరిగి ఉచితంగా అదే అంబులెన్స్‌లో రైతు ఇంటికి భద్రంగా చేరుస్తారన్నారు.గ్రామాలలో ఎక్కువగా మహిళలు పాడి పరి శ్రమపై ఆధారపడి జీవిస్తూ ఉంటారని 1962 కు కాల్ వచ్చిన వెంటనే స్పందించి పశువులకు తక్షణమే మెరుగైన వైద్యం అందించాలని అప్పుడే గ్రామాలలో మరింత పాడి పరిశ్రమ అభివృద్ధి చెందు తుందన్నారు. దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా మనుషులతో పాటు మూగజీవాలకు కూడా నాణ్యమైన వైద్యం అంది స్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. అంబులెన్స్ ద్వారా పశువులకు కల్పించే వైద్య సేవలు గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్లు వై.పద్మావతి ఎడి ఏహెచ్ సంతమాగులూరు, ఎం.మోహన్ రావు ఎడి ఏహెచ్ అద్దంకి పి.మహేశ్వరావు, ఆర్.పావని కుమారి, జి.వెంకట్రావు, సంతమాగులూరు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ చింతల.శ్రీ ఎరయ్య, ఎంపీపీ బడుగు.శ్రీలక్ష్మి, సర్పంచులు ధూళిపాళ్ల. బులిరామయ్య, ఏల్చూరి.శివపార్వతి హరిబాబు, పసల అంజలి నాగేశ్వరరావు, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ శ్రీనువలి, తదిరులు పాల్గొన్నారు.

పీపుల్స్ ట్రామా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సేవలు

విశాలాంధ్ర-చీరాల : ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తూ వైద్య సేవలకు ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్ళే అవసరం లేకుండా కార్పొరేట్ వైద్య సేవలు అందుబాటులోకి తీసికొచ్చి ప్రజల ఆరోగ్యానికి నిండైన రక్షణగా నిలిచేందుకు పేద, బడుగు, బలహీన వర్గాలకు తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందించాలనే దృఢ సంకల్పంతో చీరాల పట్టణ నడిబొడ్డున నారాయణ కాలేజీ ప్రక్కన పీపుల్స్ ట్రామామల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రారంభించామని డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ నాగూర్ బాషాలు అన్నారు. చీరాల పట్టణంలో పీపుల్స్ ట్రామా మల్టిస్పెషాలిటీ హాస్పిటల్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ చంద్రశేఖర్‌లు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి రక్షణకవచంగా ప్రజలకు మెరుగైన కార్పొరేట్ వైద్య సేవలు అందించేందుకు ఈ వైద్యశాలను స్థాపించామని అన్నారు. ఈ వైద్యశాలలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన వైద్య సదుపాయాలు 24 గంటలు వైద్య సేవలు అందించేందుకు వైద్య రంగంలో విశేష అనుభవం కలిగిన ప్రముఖ వైద్యులు అందుబాటులో ఉన్నారని, అత్యాధునిక టెక్నాలజీని జోడించి ఏర్పాటు చేసిన క్లినికల్ ల్యాబ్, ఎక్స్ రే,24 గం"ఫార్మసీ, అత్యాధునిక ఆపరేషన్ థియేటర్, ఐసి యూ, వెంటిలేటర్స్ సదుపాయాలు, అందుబాటులో ఉన్నా యని అన్నారు. వైద్యశాలలో జనరల్ మెడిసిన్, డయా బెటాలజీ, ఎమర్జెన్సీ, క్రిటికల్ కేర్, ఆర్థోపెడిక్,జాయింట్ రీప్లేస్మెంట్, జనరల్ సర్జరీ, లాప్రోస్కోపి సర్జరీ, న్యూరాలజీ, న్యూరో సర్జరీ, పల్మోనాలజీ, పిడియాట్రిక్, నెఫ్రాలజీ, యూరాలజీ, ఫిజియోథెరపీ, లేజర్ థెరపీ, గైనకాలజీ,వెన్నెముక సర్జరీ, గ్యాస్ట్రో, ఎండో స్కోపీ, కార్డియాలజీ, వాస్కులర్ సర్జరీ, అంకాలజీ మొదలగు వైద్య సేవలు పీపుల్స్ ట్రామా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఉంటాయని అన్నారు. చీరాల పరిసర ప్రాంతాల ప్రజలకు అతితక్కువ ఖర్చుతో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పీపుల్స్ ట్రామా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్లో వైద్య సేవలు అందిస్తామని అపాయింట్మెంట్ కొరకు చరవాణి సంబర్ 8019600690ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్,డాక్టర్ కోర్నియల్ జె,కాశీ విశ్వనాథం,మేనేజింగ్ డైరెక్టర్ దావుద్ వలీ, నాగూర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర బాపట్ల జిల్లా

నదీ భూముల వివాదంలో డీఎస్పీ విచారణ

విశాలాంధ్ర-కొల్లూరు : నదీ భూముల విషయంలో చోటుచేసుకున్న ఘర్షణలలో ఎస్సీ వర్గానికి చెందిన వ్యక్తులు చేసిన ఫిర్యాదుపై రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ శుక్రవారం విచారణ నిర్వహించారు. కొల్లూరు మండలపరిధిలోని పెదలంక చర్చి ప్రాంగణంలో ఘర్షణ సమయంలో జరిగిన దాడిలో గాయపడిన వ్యక్తులతోపాటు, స్థానికులను నంచి వివాదంకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత వర్గంకు చెందిన వ్యక్తులను విచారించి వారి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. ఈసందర్భంగా ఆయన కొల్లూరు పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ కేసు విషయంలో క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టామని, విచారణను పారదర్శకంగా నిర్వహించడంతోపాటు, నింధితులపై చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు. నదీ భూములలో ఎటువంటి కార్యకలాపాలు చేపట్టకుండా 145 సెక్షన్ అమలులో ఉందని, ఇరు వర్గాలకు చెందిన వ్యక్తుల ఆభూముల్లోకి వెళ్లరాదని హెచ్చరించారు.

గర్భిణీల వివరాల నమోదు తప్పనిసరి

విశాలాంధ్ర - బాపట్ల : ల్యాబ్ టెక్నిషన్లు తప్పనిసరిగా గర్భిణీల వివరాలు నమోదు చేయాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి ఎస్.విజయమ్మ తెలిపారు. బాపట్ల వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం జిల్లాలోని ల్యాబ్ టెక్నిషన్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయమ్మ మాట్లాడుతూ ప్రతి నెల 9వ తేదీన గర్భిణీలకు హిమోగ్లోబిన్, యూరిన్ ఆల్బుమిన్ పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం విజయవంతంలో భాగంగా గర్భిణీలకు అన్నీ రకాల పరీక్షలు నిర్వహించాలన్నారు. రక్తహీనత గుర్తించిన గర్భిణీలను వైద్యాధికారుల వద్దకు తీసుకుని వెళ్లి అవసరమైన సేవలు అందించాలన్నారు. ఎన్జీవో కార్యాలయంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌వోలకు జరుగుతున్న వారం రోజుల శిక్షణ హాజరై వైఎస్సార్ క్లినిక్ ఆధ్వర్యంలో అందిస్తున్న వైద్య సేవలు విశిష్టతను తెలపాలన్నారు. మంచానికే పరితమైన రోగులకు, దీర్ఘకాలీక వ్యాధులతో బాధపడుతన్న వారిని ప్యామిలీ డాక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి వైద్యసేవలు అందిస్తూ ఆరోగ్యాంధ్రప్రదేశ్ స్థాపనకు కృషి చేయాలన్నారు. వ్యాధి నిరోధక టీకాల అధికారి టి.వెంకటేశ్వర్లు, రోహిణిరత్నశ్రీ, సౌజన్య, రాజ్‌కుమార్, రాంబాబు, శరత్ ఉన్నారు.

ప్రముఖ దర్శకులు కె.విశ్వనాథ్‌కు నివాళి

విశాలాంధ్ర - భట్టిప్రోలు : ప్రముఖ దర్శకులు కె.విశ్వనాథ్ మృతి తీరనిలోటని ఎంపిపి డి.లలితకుమారి, జడ్‌పిటిసి సభ్యురాలు టి.ఉదయభాస్కరి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం విశ్వనాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన పుట్టిన పెదపులివర్రు గ్రామం నుంచి ప్రజాప్రతినిధిగా ఉండడం గర్వంగా ఉందని ఆయన ఆత్మకు శాంతి చేకురాలని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ జి.చంద్రశేఖర్, ఈఓపిఆర్‌డి సిహెచ్. శేఖర్, ఎపిఎం శోభన్‌బాబు, ఎఈ రామచంద్రరావు, ఎఓ జలజ తదితరులు పాల్గొన్నారు.

రేపు భట్టిప్రోలులో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - భట్టిప్రోలు : భట్టిప్రోలు ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 5న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సభ్యులు తెలిపారు. స్థానిక వేణుగోపాలస్వామి దేవస్థానంలో గల కళావేధిక ప్రాంగణంలో ఆదివారం ఉదయం 9 గంటలకు నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు శిబిరం జరుగుతుందన్నారు. ఈ శిబిరంలో క్యాన్సర్, గుండె, మూత్రపిండాలు, దంతాలు, సాధారణ వ్యాధులకు సంబందించి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణి చేస్తారన్నారు. కావున భట్టిప్రోలు పరిసర గ్రామాల ప్రజలు ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరారు.

పౌష్టికాహార లోప నివారణకు చర్యలు

విశాలాంధ్ర-జెపంగులూరు : పౌష్టికాహార లోపాన్ని నియంత్రించేందుకు మహిళా పోలీసులు, అంగన్వాడీలు, ఏఎన్ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు కృషి చేయాలని ఎస్పిసిసి జిల్లా కోఆర్డినేటర్ జి.చైతన్య అన్నారు. మండలంలోనీ పంగులూరులో ఈరోజు జరిగిన సంభాషణ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంగన్వాడీలకు 0నుండి 5 సంవత్సరాల పిల్లలను కేటాయించడం జరిగిందని, మహిళా పోలీసులకు 6 నుండి 12 సంవత్సరాల పిల్లలను కేటాయించడం జరిగిందని, వెల్ఫేర్ అసిస్టెంట్లకు 13 నుంచి 19 సంవత్సరాలు పిల్లల కేటాయిం చడం జరిగిందని, ఏఎన్ఎంలకు బాలింతలను, గర్భవతులను కేటాయించడం జరిగిందని తెలిపారు. వీరందరూ కలిసి వారి కేటాయించిన వారితో ముఖాముఖిగా మాట్లాడాలని, పౌష్టికాహారం లోపాన్ని నివారించడానికి ఎలాంటి ఆహారం తీసు కోవాలనేది వారికి వివరించాలనీ, సూచించారు. బాలింతలు గరపేతులను సూచనలు చేసేటప్పుడు వారి కేర్ టేకర్లైన తల్లి, తండ్రి, భర్తలతో కూడా మాట్లాడాలని, తగు సూచనలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధి కారి డాక్టర్ మల్లికార్జునరావు ప్రాథమిక వైద్యుని వైద్యులు డాక్టర్ శివ చెన్నయ్య సిపిడిఓ కృష్ణ కుమారి సిహెచ్‌ఓ భారతి హెల్త్ డిక్టేటర్ అనురాధ మహిళా పోలీసులు పాల్గొన్నారు.

నింగికేగిన కాశీనాథుడు..

పెదపులివర్రులో విషాదచాయలు..

విశాలాంధ్ర - భట్టిప్రోలు : సరికొత్త సంగీతానికి రూపకర్త కళాతపస్వీ కాశీనాధుని విశ్వనాథ్ తుదిశ్వాస విడిచారన్న వార్త బాపట్ల జిల్లా పెదపులివర్రు గ్రామాన్ని విషాదచాయల్లో ముంచింది. సినీ వినీలాకాశంలో ఒక వెలుగు వెలిగిన విశ్వనాథుడు గురువారం అర్థరాత్రి మృతి చెందాడన్న వార్త టీవీల ద్వారా తెలుసుకున్న పెదపులివర్రు గ్రామస్తులు శోక సంద్రంలో మునిగిపోయారు. సినీ రంగంలో సాహిత్యానికి, సంగీతానికి ఎంతో విలువనిచ్చి సంప్రదాయ సంగీతానికి చిరునామకు కొత్త వరవడిని తీసుకువచ్చిన ఆయన ఇక లేరన్న నిజాన్ని నమ్మలేకపోతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా భట్టిప్రోలు మండలం కృష్ణానదీ తీర గ్రామమైన పెదపులివర్రు గ్రామంలో 1930 ఫిబ్రవరి 19న జన్మించారు. కాశీనాథ్ జనం మెచ్చిన సినిమా దర్శకుడుగా ఎన్నో అవార్డులను అందుకోవడంతో ప్రపంచ స్థాయిలో గ్రామానికి పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చారు. 3వ తరగతి వరకు పెదపులివర్రు గ్రామంలోని ఎలిమెంటరీ పాఠశాలలో విద్యను అభ్యసించారు. జన్మించిన గ్రామం, గ్రామంలోని శివాలయం అంటే ఆయనకు ఎంతో మక్కువ, గ్రామానికి వచ్చినప్పుడల్లా ఆయన తండ్రి సుబ్రహ్మణ్యం అర్చకత్వం వహించిన శ్రీరాజరాజ నరేంద్రస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించడం ఆయనకు ఎంతో ఇష్టం.

బాల్య స్నేహితుడిని కోల్పోయా..

విశ్వనాద్ బాల్య స్నేహితుడు కొడమంచిలి వెంకట సుబ్బారావు

కాశీనాధుని సుబ్రహ్మణ్యం - సరస్వతమ్మలకు ఏకైక కుమారుడు విశ్వనాథుడు. చిన్నతనంలో ఆయన నేను కలసి ఎలిమెంటరీ పాఠశాలలో చదువుకున్నాము. ఉన్నత విద్య అనంతరం ఇద్దరం కలసి సినిమా పరిశ్రమలో పని చేశాము. విశ్వనాథ్ చెన్నైలోని వాహినీ స్టూడియోలో సౌండ్ ఇంజనీర్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టగా నేను జివిఎస్ ప్రొడక్షన్‌లో ప్రొడక్షన్ మేనేజర్‌గా పనిచేశాము. పండుగలు వచ్చినప్పుడల్లా నూతన వస్త్రాలు పంపించేవాడు. గ్రామస్తులంటే అమితమైన ప్రేమ. ఆయన మరణం ఎంతో బాధ కలిగిస్తుంది. మంచి బాల్య మిత్రుడిని కోల్పోయాను.

విశ్వనాథ్‌తో గ్రామస్తులు దిగిన ఫోటోలు

విశ్వనాథ్ బాల్య స్నేహితుడు వెంకట సుబ్బారావు

మంచి వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి విశ్వనాథ్

- సజ్జా బసవపున్నయ్య

గ్రామంలో విశ్వనాథ్ ఇంటికి ముందు చిన్న కిల్లీ షాపు పెట్టుకుని జీవనం సాగించాను. విశ్వనాథ్ ఇంటిని 1994లో కొనుగోలు చేయగా స్వయంగా ఆయనే వచ్చి రిజిస్ట్రేషన్ చేశారు. ఇల్లు కొనుగోలు చేసిన తరువాత నాకు విద్యుత్ శాఖలో లైన్‌మెన్ ఉద్యోగం వచ్చింది. ఆయన దయ వల్ల డాబా కట్టుకుని సుఖంగా ఉంటున్నాం. మమ్మల్ని సొంత మనుషుల్లాగా చూసేవారు. గ్రామానికి వచ్చినప్పుడల్లా ఆప్యాయంగా పలకరించేవారు. ఆయన మృతి దిగ్భ్రాంతికి గురయ్యాము.

కళాతపస్వీ మృతి చిత్ర పరిశ్రమకు తీరని లోటు..

- మాజీ మంత్రి నక్కా ఆనందబాబు

కళాతపస్వీ కె.విశ్వనాథ్ కన్నుమూయడం చిత్ర పరిశ్రమకు తీరని లోటని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు అన్నారు. వేమూరు నియోజకవర్గం పెదపులివర్రులో ఆయన జన్మించడం మా అదృష్టమన్నారు. నియోజకవర్గం నుంచి ఎదిగిన విశ్వనాథ్ చిత్ర పరిశ్రమకు గొప్ప పేరు సంపాదించారన్నారు. విశ్వనాద్ సినిమాలు తెలుగు సినీ పరిశ్రమకు మణిమకుటాలన్నారు. దాదాసాహెబ్ పాల్కే అవార్డు దక్కించుకున్న విశ్వనాథ్‌ను ఆయన స్వగ్రామమైన పెదపులివర్రులో ఘనంగా సత్కరించుకున్నామని ఆనందబాబు చెప్పారు. విశ్వనాథ్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ ఆయన కుటుంబ సభ్యులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

బాల్యంలో విశ్వనాథ్ కుటుంబ సభ్యులు నివాసం ఉన్న ఇల్లు

బాల్యంలో విశ్వనాద్ చదువుకున్న పాఠశాల

విశ్వనాథ్‌కు పెదపులివర్రులో సత్కారం(ఫైల్ ఫోటో)